నీలగిరి ఎక్స్‌ప్రెస్
తెలుగు దిన పత్రిక
RNI - TELTEL/2023/87644


## నీలగిరి నిత్యపద్యం

అంతర్జాతీయ నవ్వుల దినోత్సవం

ఆ.వె!!

నవ్వుచుండుమెపుడు, నవ్వించుచుండుము
నవ్వుతోనె బ్రతుకు నాకమౌను!
నవ్వరాదునెపుడు నలుగురినేడ్పిస్తు
నవ్వులాటగాకు నువ్వునెపుడు!!

మీ
విజయప్రసాద్ నలుమాసు
తెలుగు బోధకులు,కవి


## విలేకరులు కావలెను


తెలంగాణ &ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాలలో (నీలగిరి ఎక్స్ ప్రెస్): & చైతన్య గళం ఛానల్ లో పని చేయుటకు
- బ్యూరో ఇన్చార్జ్ లు- జిల్లా స్టాఫ్ రిపోర్టర్ లు -ఇన్చార్జ్ లు
- మండల రిపోర్టర్ లు
- క్రైమ్ రిపోర్టర్ లు
-జిల్లాల వారిగా ఆడ్ ఇన్చార్జ్ లు కావలెను. వివరాలకు మా WHATS APP నంబర్:- 9705770909 సంప్రదించండి.



సంచిక : 1 | సంపుటి : 4 | తెలంగాణ | ఆంధ్రప్రదేశ్ | సోమవారం | 04-05-2026 | పేజీలు-8 | వెల: రూ. 5.00


# సన్‌రైజర్స్‌కు కేకేఆర్ షాక్

- ఉప్పల్‌లో ఆగిపోయిన హైదరాబాద్ విజయ పరంపర..!
- 7 వికెట్ల తేడాతో విజయం సాధించిన కేకేఆర్
- హ్యాట్రిక్ విజయాలు సాధించిన కోల్‌కతా



హైదరాబాద్,
ఐపీఎల్ 2026లో డబుల్ హ్యాట్రిక్ విజయాలు సాధించాలని భావించిన సన్ రైజర్స్ హైదరాబాద్‌కు కోల్‌కతా నైట్ రైడర్స్ బ్రేక్ వేసింది. తొలుత బాల్‌తో సన్ రైజర్స్ బ్యాటర్లను కట్టడి చేసి, ఆపై బ్యాటింగ్‌లోనూ అదరగొట్టింది. దీంతో కేకేఆర్ ఈ సీజన్‌లో మూడో విజయాన్ని నమోదు చేసింది. ఈ లీగ్‌లో తొలి ఆరు మ్యాచులలో ఒక్క విజయం కూడా సాధించని కేకేఆర్.. తాజాగా హ్యాట్రిక్ విజయాలు సాధించి.. ట్రాక్‌లోకి వచ్చింది. మరోవైపు సన్ రైజర్స్.. 10 మ్యాచులలో నాలుగో ఓటమి నమోదు చేసింది. ఉప్పల్ వేదికగా జరిగిన ఈ మ్యాచ్‌లో తొలుత

-మిగతా 2 లో



## కర్ణాటకలో ఆర్టీసీ కార్మికుల సమ్మె బాట

- ఈ నెల 20 నుంచి నిరవధిక సమ్మె
- కాంగ్రెస్ సర్కార్ తీరుపై ఆగ్రహం

బెంగళూరు,
కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో ఆర్టీసీ ఉద్యోగుల పరిస్థితి దయనీయంగా మారింది. తెలంగాణలో ఆర్టీసీ ఉద్యోగులు ఉద్యమ బాటపట్టగా, తాజాగా కాంగ్రెస్ అధికారంలో ఉన్న మరో రాష్ట్రం కర్ణాటకలోనూ ఆర్టీసీ కార్మికులు సమ్మెకు సిద్ధమవుతున్నారు. ఈ నెల 20 నుంచి రాష్ట్రవ్యాప్త నిరవధిక సమ్మెకు కర్ణాటక రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థల కార్మిక సంఘాల సంయుక్త కార్యాచరణ కమిటీ(జేఏసీ) పిలుపునిచ్చింది.కార్మిక సంఘాల నాయకులు, రవాణా మంత్రి రామలింగా రెడ్డి మధ్య ఇటీవల జరిగిన చర్చలు విఫలమైన నేపథ్యంలో మే 20 ఉదయం 6 గంటల నుంచి కేఎస్ఆర్టీసీ, బీఎంటీసీ, ఎన్‌డబ్ల్యూకేఆర్టీసీ, కేకేఆర్టీసీకి చెందిన బస్సులు నిలిచిపోనున్నాయి. కేఎస్ఆర్టీసీ సిబ్బంది, కార్మికుల సమాఖ్య అధ్యక్షుడు జ్యోతి అనంత సుబ్బారావు శనివారం విలేకరుల సమావేశంలో సమ్మె నిర్ణయాన్ని ప్రకటించారు. 2024 జనవరి నుంచి 25 శాతం జీతం పెంపును తమ సంఘాలు డిమాండు చేసినట్లు ఆయన చెప్పారు. నిర్ణీత కాల వ్యవధిలో వేతన సవరణ అమలు చేయాలని మంత్రిని కోరినట్లు ఆయన తెలిపారు.

-మిగతా 2 లో

## అంతరిక్షంలోకి భారత దృష్టి.

- కక్ష్యలోకి చేరిన శాటిలైట్

2 లో

# అధికారం ఎవరిని వరించేనో!

బెంగాల్, తమిళనాడు, కేరళ, అస్సాం, పుదుచ్చేరి నేడే కౌంటింగ్

- ఐదు రాష్ట్రాల ఎన్నికల ఫలితాలకు సర్వం సిద్ధం
- ఉదయం 8 గంటల నుంచి ప్రారంభం కానున్న లెక్కింపు
- మధ్యాహ్నానికే స్పష్టత వచ్చే అవకాశం
- పశ్చిమ బెంగాల్‌లో భారీ భద్రత





న్యూఢిల్లీ
ఐదు అసెంబ్లీలకు జరిగిన ఎన్నికలు ఆఖరి అంకానికి చేరుకున్నాయి. సోమవారం ఓట్ల లెక్కింపు, ఫలితాల వెల్లడికి ఎన్నికల కమిషన్ అన్ని ఏర్పాట్లు చేసింది. కేరళం, తమిళనాడు, అస్సాం, పశ్చిమ బెంగాల్, కేంద్ర పాలిత ప్రాంతం పుదుచ్చేరిలకు అసెంబ్లీ ఎన్నికలు జరిగిన సంగతి తెలిసిందే. ఈ ఓట్ల లెక్కింపు సోమవారం ఉదయం 8 గంటల నుంచి ప్రారంభం కానుంది. ఆయా రాష్ట్రాల్లో ఈసారి రికార్డు స్థాయిలో పోలింగ్ నమోదైంది. దీంతో ఎన్నికల ఫలితాలపై సర్వ త్రా ఉత్కంఠ నెలకుంది. నేటి మధ్యాహ్నంలోగానే ఫలితాలపై ఒక స్పష్టత వచ్చే అవకాశం ఉందని భావిస్తున్నారు. పశ్చిమబెంగాల్ మినహా మిగిలిన అన్ని చోట్ల ఒకే దశలో ఎన్నికలను నిర్వహించారు. బెంగాల్లో మాత్రం రెండు విడతలుగా ఎన్నికలు జరిగాయి. రెండో విడతలో అక్రమాలు జరిగినట్లు ఫిర్యాదులు రావడంతో అనేక చోట్ల శనివారం రీపోలింగ్ నిర్వహించారు.

-మిగతా 2 లో



## అర్హతే కొలమానం.. రాజకీయాలకు తావులేదు

- త్వరలోనే రెండో విడత 'ఇందిరమ్మ' ఇండ్ల మంజూరు :
- ప్రజాదర్బార్‌లో మంత్రి పొంగులేటి భరోసా


కూసుమంచి
ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగే అవసరం లేకుండా, అధికారులే నేరుగా ప్రజల వద్దకు వచ్చి అర్జీలు స్వీకరించి పరిష్కరించడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. ఆదివారం కూసుమంచిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్వహించిన 'ప్రజా దర్బార్'లో ఆయన పాల్గొన్నారు. జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్, అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజతో కలిసి ప్రజల నుంచి నేరుగా వినతులు స్వీకరించారు.

-మిగతా 2 లో

## మా అనుమతి లేకుండా ఒక్క నౌక వెళ్లదు!

- జలసంధి దాటనీయబోమని ఇరాన్ వార్నింగ్
- నియంత్రించడం ఇరాన్ సహజమైన హక్కు
- స్పష్టం చేసిన ఆర్మీ ప్రతినిధి అక్రమినియా
- జలసంధిలో సరికొత్త అధ్యాయం మొదలైంది
- చట్టపరమైన ఫ్రేమ్‌వర్క్ తీసుకొస్తామన్న మొజ్తాబా ఖమేనీ

2లో



## కరీంనగర్‌లో పట్టపగలే తుపాకుల మోత

- పీఎంజే జ్యువెలరీలో 'సినిమా ఫక్కీ'లో రక్తపాతం..భారీ దోపిడీ
- కస్టమర్ల ముసుగులో వచ్చి రెచ్చిపోయిన ఐదుగురు దుండగులు
- నగలు దోచుకుంటూ.. అడ్డుకున్న సిబ్బందిపై విచక్షణారహితంగా కాల్పులు
- రక్తపు మడుగులో నలుగురు ఉద్యోగులు.. ఒకరి పరిస్థితి విషమం
- పారిపోతూ గాలిలోకి ఫైరింగ్..దొరికిన కీలక ఆధారాలు
- రంగంలోకి దిగిన ఐజీ, సీపీ..ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా హై అలర్ట్, నాకాబందీ
- బాధితులకు అండగా నిలిచిన రాజకీయ నేతలు, మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలింపు



కరీంనగర్ క్రైమ్
కరీంనగర్ నగరం నడిబొడ్డున, ప్రశాంతంగా గడిచిపోతున్న ఆదివారం ఉదయం ఒక్కసారిగా ఉలిక్కిపడింది. జ్యోతినగర్‌లోని అత్యంత రద్దీ ప్రాంతంలో ఉన్న ప్రముఖ పీఎంజే జ్యువెలరీ షోరూమ్‌లో పట్టపగలు తుపాకుల మోత మోగింది. అత్యంత పకడ్బందీగా, పక్కా స్కెచ్‌తో కస్టమర్ల ముసుగులో లోపలికి ప్రవేశించిన ఐదుగురు దుండగులు క్షణాల్లోనే తుపాకులతో భయానక వాతావరణం సష్టించారు. హాలీవుడ్ క్రైమ్ థ్రిల్లర్‌ను తలపించేలా అడ్డుకోబోయిన సిబ్బందిపై విచక్షణారహితంగా కాల్పులకు తెగబడి,

-మిగతా 2 లో

# ఫీజు రీయింబర్స్‌మెంట్ రద్దుకు కుట్ర

జీవో 7 అందుకోసమే..




**14 లక్షల మంది విద్యార్థులకు వెన్నుపోటు**

- వైఎస్ పథకాలకూ పాతరేస్తున్న సర్కారు
- విద్యార్థిలోకం గర్జిస్తే మంత్రులు రోడ్లపై తిరగరు
- రూ.10 వేల కోట్ల ఫీజు బకాయిలను విడుదల చేయాలి
- సీఎం రేవంత్‌రెడ్డికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ లేఖ



హైదరాబాద్
రేండున్నరేండ్ల కాంగ్రెస్ అసమర్థ పాలనలో ఇప్పటికే విద్యావ్యవస్థను కుప్పకూలిందని బీఆర్ఎస్ వర్కింగ్ కల్వకుంట్ల తారక రామారావు (కేటీఆర్) విమర్శించారు. ఇప్పుడు ఏకంగా ఉన్నత చదువులకు నిరుపేదలను పూర్తిగా దూరం చేసేలా విద్యార్థులకు వెన్నుపోటు పొడుస్తారా?అని ప్రశ్నించారు. రాష్ట్రంలోని 14 లక్షల మంది బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ విద్యార్థులకు కొండంత అండగా నిలిచే ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని రద్దు చేసే కుట్ర భయంకరమైనదని తెలిపారు. విద్యార్థుల భవిష్యత్తును అంధకారంలోకి నెట్టేందుకే కాంగ్రెస్ ప్రభుత్వం

-మిగతా 2 లో




## ఢిల్లీలో ఘోరం

- అగ్నిప్రమాదంలో 9 మంది మృతి
- ఏసీ పేలడంతో ఘటన

న్యూఢిల్లీ
ఢిల్లీలోని వివేక్ విహార్ ఏరియా, షహదారాలోని నాలుగంతస్తుల బిల్డింగులో ఆదివారం ఉదయం అగ్నిప్రమాదం సంభవించింది.వేకువ ఝామున 3.30 గంటల సమయంలో జరిగిన ఈ ఘటనలో 9 మంది మరణించారు. ఘటనపై సమాచారం అందుకున్న సహాయక బృందాలు దాదాపు 15 మందిని రక్షించాయి. అయితే, సహాయక చర్యలకు చాలా ఆటంకం ఏర్పడింది. ప్రమాదానికి గల కారణాల్ని అధికారులు ఆరా తీస్తున్నారు. మొదట రెండో ఫ్లోర్‌లో మొదలైన మంటలు తర్వాత మూడు, నాలుగు ఫ్లోర్లలోకి వ్యాపించాయి.

-మిగతా 2 లో



## తిరుమలలో భారీ రద్దీ

- ఒక్కరోజే 91వేల మందికి స్వామివారి దర్శనం
- 16 గంటలు క్యూలోనే..

హైదరాబాద్,
ఎండాకాలం సెలవుల నేపథ్యంలో తిరుమల శ్రీవారి దర్శనానికి భక్తులు పోటెత్తారు. శనివారం రికార్డు స్థాయిలో 91,005 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నట్లు టీటీడీ అధికారులు తెలిపారు. స్వామివారికి 36,257 మంది తలనీలాలు సమర్పించుకున్నారని, భక్తులు సమర్పించిన కానుకల ద్వారా శ్రీవారి హుండీ ఆదాయం ఒక్కరోజే రూ.3.37 కోట్లుగా నమోదై రికార్డు

-మిగతా 2 లో

# సన్‌రైజర్స్‌కు కేకేఆర్ షాక్



మొదటి తరువాయి

బ్యాటింగ్ చేసిన సన్ రైజర్స్ ఓ దశలో.. 71/1 (6 ఓవర్లు), 105/1 (8.5 ఓవర్లు)తో నిలిచి.. భారీ స్కోరు చేసేలా కనిపించింది. కానీ ఆ తర్వాత అనూహ్యంగా తడబడింది. చివరి 9 వికెట్లను కేవలం 60 పరుగుల వ్యవధిలోనే కోల్పోయింది. అనంతరం ఛేజింగ్ ప్రారంభించిన కేకేఆర్.. ఏ దశలోనూ ఇబ్బంది పడలేదు. ఓపెనర్లు అజింక్య రహానే (36 బంతుల్లో 43 రన్స్), ఫిన్ అలెన్ (13 బంతుల్లో 29 రన్స్) రాణించారు. తొలి వికెట్‌కు 4 ఓవర్లలో 49 పరుగులు జోడించారు. ఆ తర్వాత వచ్చిన రఘువంశీ (47 బంతుల్లో 59 పరుగులు) జట్టు విజయంలో కీలకపాత్ర పోషించాడు.రింకూ సింగ్ (11 బంతుల్లో 22 రన్స్) ఫినిషింగ్ టచ్ ఇవ్వడంతో కేకేఆర్. 18.2 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది. సన్ రైజర్స్ హైదరాబాద్ బౌలర్లలో ప్యాట్ కమిన్స్, శివంగ్ కుమార్, సాకిబ్ హుస్సేన్ తలా ఓ వికెట్ తీశారు.ఈ విజయంతో కేకేఆర్.. తన ఖాతాలో మరో రెండు పాయింట్లు జత చేసింది. మొత్తంగా ఆ జట్టు ఆడిన 9 మ్యాచులలో మూడు విజయాలతో 8వ ప్లేసులో ఉంది. ఇక సన్ రైజర్స్ హైదరాబాద్.. 10 మ్యాచులలో ఆరు విజయాలతో పాయింట్ల పట్టికలో మూడో ప్లేసులో కొనసాగుతోంది. కేకేఆర్‌తో మ్యాచులో ఓడిపోయినా.. ఆ జట్టు స్థానం మాత్రం మారలేదు. సన్ రైజర్స్ తన తర్వాతి మ్యాచులో మే 6న పంజాబ్ కింగ్స్‌తో తలపడనుంది.


# అధికారం ఎవరిని వరించేనో!..

మొదటి తరువాయి

ఇక ఫల్తా నియోజకవర్గం యావత్తు రీపోలింగ్ కు ఇసి అసాధారణ ఆదేశాలు ఇవ్వడం సంచలనంగా మారింది. ఇక్కడ ఈ నెల 21న రీపోలింగ్ నిర్వహించనున్నారు. 24న ఫలితాలు వెల్లడించనున్నారు. ఈ నేపథ్యంలో బెంగాల్ పై ఇసి, కేంద్ర హోం మంత్రిత్వ శాఖ ప్రత్యేక దృష్టి పెట్టాయి. భారీ స్థాయిలో భద్రతను ఏర్పాటు చేశారు. ముఖ్యంగా 11 జిల్లాలను అత్యంత సున్నితమైన ప్రాంతాలుగా గుర్తించారు. ఈ జాబితాలో ముర్షిదాబాద్, ఉత్తర 24 పరగణాలు, దక్షిణ 24 పరగణాలు, కూచ్ బెహార్, మాల్దా, నాడియా, బీర్‌భూం, పశ్చిమ మేదినీపూర్, హుగ్లీ వంటి జిల్లాలున్నాయి. ఈ జిల్లాల్లో హై అలర్ట్ ప్రకటించి, ఫలితాలు వెలువడే సమయంలో అల్లర్లు జరగకుండా ఉండేందుకు అన్ని కేంద్ర, రాష్ట్ర ఏజెన్సీలను మోహరించినట్లు అధికారులు తెలిపారు. 75వేల మంది కేంద్ర పారామిలిటరీ దళాలను మోహరించిగా, బుల్లెట్లు, పేలుళ్లను తట్టుకోగల అధునాతన 'మార్ఫ్‌మ్యాన్' సాయుధ వాహనాలను రంగంలోకి దించారు.

# అంతరిక్షంలోకి భారత దృష్టి.

## - కక్ష్యలోకి చేరిన శాటిలైట్



న్యూఢిల్లీ:
భారత అంతరిక్ష పరిశోధనలో మరో చారిత్రక ఘట్టం నమోదైంది. భారత అతిపెద్ద ప్రైవేట్ ఉపగ్రహం 'మిషన్ దృష్టి' రోదసి ప్రయోగం విజయవంతమైంది. ఆదివారం అమెరికాలోని కాలిఫోర్నియా నుంచి 'స్పేస్ ఎక్స్'కు చెందిన ఫాల్కన్-9 రాకెట్ ద్వారా ఈ ఉపగ్రహాన్ని నిర్దేశిత కక్ష్యలో ప్రవేశపెట్టారు. ప్రపంచంలోనే మొట్టమొదటి 'ఆప్టోసార్' శాటిలైట్ ఇది అంటే సాధారణ కెమెరా (ఆప్టికల్), రాడార్ (సింథటిక్ అపర్చర్ రాడార్) టెక్నాలజీని కలిపి తయారుచేసిన హైబ్రిడ్ శాటిలైట్. భూమిపై మబ్బులు సహా ఎలాంటి వాతావరణం ఉన్నా.. అంతరిక్షం నుంచి హై-రిజల్యూషన్ చిత్రాలు తీయటం దీని ప్రత్యేకత. దీనిని రక్షణ, విపత్తు నిర్వహణ, వ్యవసాయం, మౌలిక సదుపాయాల పర్యవేక్షణకు భారత్ ఉపయోగించనున్నది.

# ఢిల్లీలో ఘోరం

మొదటి తరువాయి

సమాచారం అందుకున్న అగ్నిమాపక దళాలు, అంబులెన్స్‌లు 22 నిమిషాల్లోనే అక్కడికి చేరుకున్నాయి. ఎయిర్ కండీషన్ పేలడం వల్లే ఈ ప్రమాదం జరిగినట్టు ప్రాథమికంగా తెలుస్తోంది. అగ్నిప్రమాదం జరిగిన తర్వాత బాధితులు తప్పించుకోవడానికి అవకాశాలు తగ్గిపోయాయి. నాలుగంతస్తుల బిల్డింగ్ అయినప్పటికీ, ఒకటే మెట్ల మార్గం ఉంది. ఒకటే లిఫ్ట్ ఉంది. దీంతో ఈ మార్గాలు మూసుకుపోవడం వల్ల బాధితులు చిక్కుకుపోయారు. ఇక రెండో ఫ్లోర్‌లో అగ్నిప్రమాదం కారణంగా షార్ట్ సర్క్యూట్ ఏర్పడింది. దీంతో స్మార్ట్ లాక్ ఉన్న డోర్లు మూసుకుపోయాయి.ఫైర్ యాక్సిడెంట్ కారణంగా అవి తెరుచుకోలేదు. దీంతో ఆ ఫ్లోర్లోని బాధితులు ఆ రూముల్లోనే చిక్కుకుపోయారు. తర్వాత అందులోని వారి మృతదేహాల్ని సహాయక బృందాలు బయటకు తీశాయి. మంటలు చెలరేగడంతో అక్కడి వారు మేడ పైకి వెళ్లేందుకు ప్రయత్నించినా సాధ్యం కాలేదు. పైన డోర్లు మూసుకుపోయాయి. బాల్కనీ కూడా మూసి ఉంది. దీంతో బాధితులకు ఎటు వెళ్లాలో తెలియని పరిస్థితి నెలకొంది. బాధితులు ముందుగా పొగ ప్రభావానికి గురై కిందపడిపోగా, తర్వాత మంటలకు దగ్ధమయ్యారు.ఫస్ట్ ఫ్లోర్‌లో డోర్లు మూసుకుపోవడం వల్ల మరొకరు మరణించినట్టు తెలుస్తోంది. ఇలాంటి అనేక భద్రతా నియమాలు పాటించకపోవడం వల్లే ఈ బిల్డింగులో మృతుల సంఖ్య పెరిగినట్లు అనుమానిస్తున్నారు. మరోవైపు ఈ ఘటనపై ప్రధాని మోడీ విచారం వ్యక్తం చేశారు. బాధిత కుటుంబాలకు సానుభూతి తెలిపారు. మృతుల కుటుంబాలకు రూ.4 లక్షల పరిహారం ప్రకటించారు.

# అర్హతే కొలమానం.. రాజకీయాలకు తావులేదు

మొదటి తరువాయి

ప్రజా ప్రభుత్వం ఏర్పడిన నాటి నుండి పారదర్శక పాలనను ప్రజల గడప వద్దకే తీసుకెళ్తున్నామని, ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కార దిశగా తక్షణ చర్యలు చేపడుతున్నామని మంత్రి తెలిపారు. పాలేరు నియోజకవర్గంలో ప్రతి మండలాన్ని క్లస్టర్లుగా విభజించి నిర్వహిస్తున్న ఈ ప్రజా దర్బార్లలో అందిన ప్రతి న్యాయబద్ధమైన దరఖాస్తును రాజకీయ పార్టీలకు అతీతంగా పరిష్కరిస్తామని మంత్రి భరోసా ఇచ్చారు. సాదా బైనామా, నిషేధిత జాబితా , భూమి రికార్డుల వంటి దీర్ఘకాలిక సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేందుకు ప్రభుత్వం ప్రత్యేక కృషి చేస్తోందన్నారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ న్యాయం చేయడమే తమ ప్రభుత్వ బాధ్యతని, ఇందులో ఎలాంటి జాప్యానికి తావులేదని స్పష్టం చేశారు. తమ ప్రభుత్వం ప్రతి



సోమవారం ఇళ్ల నిర్మాణ నిధులను నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేస్తోందని, మే నెలాఖరు నాటికి రెండో దశ ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తామని ప్రకటించారు. వడ్లు, మొక్కజొన్న పంటలను మద్దతు ధరకే కొనుగోలు చేస్తున్నామని, వారం రోజుల్లోనే రైతుల ఖాతాల్లో నగదు జమ చేస్తున్నా మని తెలిపారు. మే 5 నుంచి 7 వరకు సబ్సిడీపై వ్యవసాయ పనిముట్ల పంపిణీ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, మార్కెట్ కమిటీ చైర్మన్ హరినాథ్ బాబు, ఆర్డీఓ శ్రీనివాస్, తహసీల్దార్ సైదులు, వివిధ శాఖల అధికారులు, ఆయా గ్రామాల స్థానిక ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# మా అనుమతి లేకుండా ఒక్క నౌక వెళ్లదు!

- -జలసంధి దాటనీయబోమని ఇరాన్ వార్నింగ్
- -నియంత్రించడం ఇరాన్ సహజమైన హక్కు
- -స్పష్టం చేసిన ఆర్మీ ప్రతినిధి అక్రమినియా
- -జలసంధిలో సరికొత్త అధ్యాయం మొదలైంది
- -చట్టపరమైన ఫ్రేమ్‌వర్క్ తీసుకొస్తామన్న మొజ్తాబా ఖమేనీ




న్యూఢిల్లీ,
హార్ముజ్ జలసంధిపై తమకు పూర్తి నియంత్రణ ఉందని, తమ అనుమతి లేకుండా మిత్రదేశాలు, శత్రు దేశాలకు చెందిన ఏ ఒక్క నౌక కూడా ఆ మార్గం గుండా ప్రయాణించలేదని ఇరాన్ ఆర్మీ స్పష్టం చేసింది. హార్ముజ్ జలసంధిని నియంత్రించడం తమకు ఉన్న సహజమైన హక్కు అని ఇరాన్ ఆర్మీ ప్రతినిధి మహమ్మద్ అక్రమినియా అన్నారు. ప్రస్తుతం ఇరాన్ 'ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్'.. దేశ సైన్యం సంయుక్తంగా హార్ముజ్ జలసంధిని పూర్తిస్థాయిలో నియంత్రిస్తున్నాయని మహమ్మద్ అక్రమానియా తెలిపారు. తమ బలగాల అనుమతి లేకుండా ఏ నౌకకూ ప్రయాణించే హక్కు లేదని అక్రమానియా తేల్చిచెప్పారు. మరోవైపు తమ నౌకలను అనుమతించాలంటూ వివిధ దేశాలు టెలెక్స్, లేఖల ద్వారా ఇరాన్‌ను అత్యవసరంగా అభ్యర్థిస్తున్నాయని ఇరాన్ ఉప విదేశాంగ మంత్రి హమీద్ ఘన్‌బారీ చెప్పారు.

జలసంధిలో సరికొత్త అధ్యాయం..

ఈ ఏడాది ఫిబ్రవరి 28వ తేదీ నుంచి ఇరాన్ హార్ముజ్ జలసంధిపై తన పట్టును బిగించింది. తమ భూభాగంపై అమెరికా, ఇజ్రాయెల్ సంయుక్తంగా దాడులు చేసిన నేపథ్యంలో ఆ రెండు దేశాలకు చెందిన, వాటితో సంబంధం ఉన్న నౌకలపై ఇరాన్ నిషేధం విధించింది. ఇదిలావుంటే పర్షియన్ గల్ఫ్, హార్ముజ్ జలసంధిలో ఒక కొత్త అధ్యాయం ప్రారంభం కాబోతోందని ఇటీవల ఇరాన్ సుప్రీం లీడర్ మొజ్తాబా ఖమేనీ అన్నారు. ఈ జలసంధి నిర్వహణ త్వరలోనే ఒక కొత్త చట్టపరమైన ఫ్రేమ్‌వర్క్‌ను తీసుకువస్తామని, ఇది ఈ ప్రాంతంలోని అన్ని దేశాల అభివృద్ధికి దోహదపడుతుందని తెలిపారు. భవిష్యత్తులో పర్షియన్ గల్ఫ్ శాంతి, శ్రేయస్సుతో వర్ధిల్లుతుందని ఆయన పేర్కొన్నారు.

# కరీంనగర్‌లో పట్టపగలే తుపాకుల మోత

మొదటి తరువాయి


నెత్తుటేరులు పారించి, పెద్ద ఎత్తున బంగారు ఆభరణాలతో పరారయ్యారు. ఈ దుస్సాహస ఘటన యావత్ తెలంగాణలో కలకలం రేపగా, దొంగల వేట కోసం పోలీస్ యంత్రాంగం నగరవ్యాప్తంగా నాకాబందీ విధించి జల్లెడ పడుతోంది. ఉదయం 10.45 గంటల ప్రాంతం. సిబ్బంది లాకర్ల నుంచి నగలు తీసి డిస్‌ప్లేలో పెడుతున్నారు. పక్కాగా రెక్కీ నిర్వహించిన దొంగలు.. అత్యంత అనువైన సమయం చూసి దాడికి దిగారు. రెండు బైక్‌లపై (బ్లాక్ పల్సర్, వైట్ అపాచీ) ఐదుగురు వ్యక్తులు వచ్చారు. ముందుగా ఒకరు లోపలికి వచ్చి 20 గ్రాముల చైన్ కావాలని అడిగాడు. సిబ్బంది చూపిస్తున్న క్రమంలోనే మిగతా నలుగురు లోపలికి ప్రవేశించారు. కస్టమర్ల ముసుగులో వచ్చిన వారు క్షణాల్లో తుపాకులు బయటకు తీశారు. భయానక వాతావరణం సృష్టించి, షట్టర్లు మూసేసి షోరూమ్‌ను తమ గుప్పిట్లోకి తీసుకున్నారు.

ప్రాణాలకు తెగించిన సిబ్బంది..
నెత్తురోడిన షోరూమ్

లోపలికి రాగానే దొంగలు సిబ్బంది చేతులు వెనక్కి కట్టేసి లాకర్లు తెరవాలని బెదిరించారు. వాష్‌రూమ్‌లో భయంతో దాక్కున్న ఓ మహిళను సైతం బయటకు లాక్కొచ్చి నింపాదిగా నగలు బ్యాగుల్లో సర్దుకున్నారు. అయితే, ఈ క్రమంలో షోరూమ్ మేనేజర్, సెక్యూరిటీ, ఇతర సిబ్బంది ప్రాణాలకు తెగించి వారిని అడ్డుకునే ప్రయత్నం చేశారు. ఊహించని ఈ పరిణామంతో ఖంగుతిన్న దొంగలు విచక్షణారహితంగా 7 నుంచి 8 రౌండ్ల కాల్పులు జరిపారు. ఈ కాల్పుల్లో నలుగురు ఉద్యోగులు బుల్లెట్ గాయాలతో రక్తపు మడుగులో కుప్పకూలారు. వీరిలో ఒకరి తలకు గాయం కావడంతో పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది.

పారిపోతూ గాలిలోకి ఫైరింగ్.. దొరికిన కీలక ఆధారాలు

నగలు దోచుకున్న అనంతరం దుండగులు బయటకు



పరుగులు తీశారు. అప్పుడు కూడా గాయాలతోనే సిబ్బంది వారిని వెంబడించగా, దొంగలు గాలిలోకి కాల్పులు జరుపుతూ బైక్‌లు స్టార్ట్ చేశారు. ఆ కంగారులో ఒక దొంగ కిందపడిపోగా, నగలున్న ఓ బ్యాగ్ కూడా అక్కడే పడిపోయింది. అంతేకాకుండా, వారి తుపాకీకి చెందిన మ్యాగజైన్, మూడు ఖాళీ బుల్లెట్ షెల్స్, ఒక కత్తి ఘటనా స్థలంలో పడిపోయాయి. వారు హిందీ, తెలుగు మాట్లాడుతున్నారని, ఉత్తరాదికి చెందిన అంతర్రాష్ట్ర ముఠాగా అనుమానిస్తున్నారు. వీరు సిరిసిల్ల వైపు పరారైనట్లు పోలీసులు గుర్తించారు.

పోలీసుల వేట ముమ్మరం.. నలుదిక్కులా నాకాబందీ

సమాచారం అందుకున్న వెంటనే ఐజీపీ చంద్రశేఖర్ రెడ్డి, కరీంనగర్ సీపీ గౌష్ ఆలం హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకున్నారు. క్లూస్ టీమ్, డాగ్ స్క్వాడ్ రంగంలోకి దిగాయి. సీసీటీవీ ఫుటేజీ ఆధారంగా మాస్కులు లేని నలుగురు నిందితుల ఫొటోలను పోలీసులు విడుదల చేశారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా సరిహద్దులను దిగ్బంధించి హై అలర్ట్ ప్రకటించారు. ఘటనా స్థలంలో దొరికిన మ్యాగజైన్, తూటాలు కంట్రీ మేడ్ వెపన్స్‌వా? లేక ఎక్కడైనా కొనుగోలు చేశారా? అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు.

బాధితులకు నేతల భరోసా..

ఈ ఘటన జరిగిన సమయానికి సమీపంలోనే ఉన్న కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజరు కుమార్ వెంటనే షోరూమ్ వద్దకు చేరుకున్నారు. సిబ్బంది చూపిన తెగువను ప్రశంసించిన ఆయన, మెరుగైన వైద్యం కోసం బాధితులను హైదరాబాద్ తరలిస్తున్నట్లు వెల్లడించారు. అలాగే, హుజూరాబాద్ ఎమ్మెల్యే, కాంగ్రెస్ డీసీసీ అధ్యక్షులు మేడిపల్లి సత్యం, ఎమ్మెల్యేలు గంగుల కమలాకర్, పాడి కౌశిక్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే సుంకే రవిశంకర్ తదితరులు స్థానిక ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను పరామర్శించారు. కాంగ్రెస్ నేత వెలిచాల రాజేందర్ రావు స్పందిస్తూ.. ప్రభుత్వం తరపున అన్ని విధాలా ఆదుకుంటామని, పోలీసులు అహర్నిశలు శ్రమిస్తున్నారని, ప్రజలు ఆందోళన చెందవద్దని భరోసా ఇచ్చారు.

ప్రజలకు పోలీసుల విజ్ఞప్తి

సీసీటీవీ ఫుటేజీలో కనిపించిన వ్యక్తులను ఎవరైనా గుర్తించినా, లేదా బ్లాక్ కలర్ పల్సర్ బైక్, వైట్ కలర్ అపాచీ బైక్‌లపై అనుమానాస్పదంగా సంచరిస్తున్న వ్యక్తులు కనిపించినా.. వెంటనే డయల్ 100 లేదా 8712670744, 8712670745 నంబర్లకు సమాచారం అందించాలని కరీంనగర్ పోలీసులు జిల్లా ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

# ఫీజు రీయింబర్స్‌మెంట్ రద్దుకు కుట్ర

మొదటి తరువాయి

జీవో నెంబర్ ఏడును తెచ్చిందని విమర్శించారు. ఈ మేరకు ముఖ్యమంత్రి ఎ రేవంత్‌రెడ్డికి కేటీఆర్ ఆదివారం లేఖ రాశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని పాతరేసేందుకు చేస్తున్న కుటిల ఎత్తుగడ అని తెలంగాణ సమాజానికి అర్థమైపోయిందని పేర్కొన్నారు. ఈ జీఓ వచ్చిన క్షణం నుంచి విద్యార్థులకే కాదు, లక్షలాది మంది నిరుపేద తల్లిదండ్రులకు కూడా కంటి మీద కునుకు కరువైందని ఆందోళన వ్యక్తం చేశారు. విద్యాశాఖను విధ్వంసం చేసేందుకే ఆ శాఖను పర్యవేక్షిస్తున్నారా?అని సీఎం రేవంత్‌రెడ్డిని ప్రశ్నించారు. కేసీఆర్ స్కీంలనే కాకుండా వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ప్రవేశపెట్టిన పథకాలనూ పాతరేస్తారా?అని అడిగారు. ఓవైపు గురుకులాలను దెబ్బతీసి ఉన్నత విద్యకూ ఉరివేస్తారా?అని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వానికి ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్నా దుర్మార్గమైన జీవో నెంబర్ ఏడును వెంటనే వెనక్కి తీసుకుని ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. రూ.10 వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను ప్రభుత్వం తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఆందోళనలో ఉన్న 14 లక్షల మంది బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ పేద విద్యార్థులతో దండుకట్టి కాంగ్రెస్ సర్కారుపై సమరశంఖం పూరిస్తామని తెలిపారు. ఇప్పటికే అన్నదాతల ఆందోళనలతో అట్టుడుకుతున్న రాష్ట్రంలో దగాపడ్డ విద్యార్థులు గర్జిస్తే కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు, మంత్రులు రోడ్లపై తిరగలేని పరిస్థితి వస్తుందని హెచ్చరించారు

# ఢిల్లీలో ఘోరం

మొదటి తరువాయి

సృష్టించినట్లు అధికారులు వెల్లడించారు. ఆదివారం భక్తుల రద్దీ మరింత పెరగడంతో సర్వదర్శనం కోసం వేచి ఉండే భక్తుల క్యూలు ఏటీజీహెచ్ ప్రాంతం వరకు కొనసాగుతున్నది.దర్శన టోకెన్లు లేని సామాన్య భక్తులకు శ్రీవారిని దర్శించుకునేందుకు సుమారు 16 గంటలపైగా సమయం పడుతున్నది. సెలవులు ముగిసే వరకు భారీ రద్దీ కొనసాగే అవకాశం ఉన్నందున, టీటీడీ అధికారులు అందుకు అనుగుణంగా ఏర్పాట్లు చేస్తున్నట్టు తెలిపారు. భక్తులు రద్దీ దృష్ట్యా తమ ప్రయాణాలు సాగించాలని టీటీడీ కోరింది. సెలవుల కారణంగా భక్తుల సంఖ్య రోజురోజుకూ పెరు గు తున్నదని, సెలవుల అనంతరం సా ధారణ స్థాయికి చేరుకుంటుందని తెలిపింది.



# వైశ్య భవన్‌లో భగవద్గీత ఉచిత శిక్షణ తరగతులు



**కరీంనగర్, మే 3 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** కరీంనగర్‌లోని వైశ్యభవన్‌లో వేసవి సెలవులను పురస్కరించుకుని 8 నుండి 15 సంవత్సరాల బాలబాలికలకు భగవద్గీత ఉచిత శిక్షణ తరగతులు ప్రారంభమయ్యాయి. వైశ్యభవన్ అధ్యక్షుడు చిదురు సురేష్, పాలకవర్గం ఆధ్వర్యంలో అల్లాడి రాధిక ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. దైవభక్తి పెంపొందించడంతో పాటు క్రమశిక్షణతో ఎదగడానికి ఈ తరగతులు ఉపయోగపడతాయని నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులకు భగవద్గీత పుస్తకాలు, రామకోటి పుస్తకాలు, పెన్నులు ఉచితంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో వైశ్య సేవకేంద్రం కార్యదర్శి పెద్ది విద్యాసాగర్, కోశాధికారి ముస్త్యాల రమేష్, డైరెక్టర్లు నలుమాచు చంద్రశేఖర్, కైలాస నవీన్, గీతభక్త సమాజం అధ్యక్షుడు బండ సత్తయ్య, ఉప్పల రామేశం, బండ లక్ష్మీనారాయణ పాల్గొన్నారు. భగవద్గీత శిక్షణ తరగతులు యువతలో ఆధ్యాత్మికత, క్రమశిక్షణ పెంపొందించడమే లక్ష్యంగా నిర్వహించబడుతున్నాయి.

## ప్రశాంతంగా ముగిసిన నీట్-2026 పరీక్ష



**సిద్ధిపేట, మే 3 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** జిల్లాలో నీట్-2026 ప్రవేశ పరీక్ష ప్రశాంత వాతావరణంలో విజయవంతంగా నిర్వహించబడిందని కలెక్టర్ కె. హైమావతి తెలిపారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల పరీక్ష కేంద్రాల్లో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరీక్ష జరిగింది. జిల్లాలో మొత్తం 937 మంది అభ్యర్థులు నమోదు చేసుకోగా, 916 మంది హాజరయ్యారు. 21 మంది గైర్హాజరయ్యారు. కలెక్టర్ స్వయంగా పరీక్ష కేంద్రాలను సందర్శించి నిర్వహణను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ముందస్తు ప్రణాళికతో పరీక్షను విజయవంతంగా నిర్వహించామని, రెండు కేంద్రాల్లో ఆర్డీఓ నేతృత్వంలో పగడ్బందీగా పోలీసు భద్రత ఏర్పాటు చేయడంతో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగలేదని తెలిపారు. పరీక్ష నిర్వహణలో అధికారులు సమన్వయంతో కృషి చేసినందుకు అభినందనలు తెలిపారు. సిద్ధిపేట జిల్లాలో నీట్-2026 పరీక్ష ఎలాంటి అంతరాయం లేకుండా విజయవంతంగా ముగిసింది.

## అకాల వర్షాలతో తడిసిన ధాన్యం కొనుగోలు చేయాలి



**హుస్నాబాద్, మే 3 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కోహెడ మండలంలోని వెంకటేశ్వర్లపల్లి గ్రామ పరిధిలోని మార్కెట్ యార్డులో నిల్వ ఉంచిన వడ్లు, మక్కజొన్నలు ఆదివారం కురిసిన అకాల వర్షాలతో తడవడంతో రైతులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. ఈ పరిస్థితిని పరిశీలించడానికి రైతు సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి, కంటెస్టెడ్ ఎమ్మెల్సీ పిడిశెట్టి రాజు మార్కెట్ యార్డును సందర్శించారు. తడిసిన ధాన్యాన్ని పరిశీలించిన ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం తక్షణమే కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేసి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఆలస్యం చేస్తే రైతులు తీవ్ర నష్టాలను ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. రైతులను అన్ని విధాలుగా ఆదుకునే చర్యలు చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ సందర్శనలో పలువురు రైతులు పాల్గొని తమ సమస్యలను వివరించారు. అకాల వర్షాలతో నష్టపోయిన రైతులను వెంటనే ఆదుకోవాలని పిడిశెట్టి రాజు ప్రభుత్వాన్ని కోరారు.

## బిక్షపతి ని పరామర్శించిన కౌన్సిలర్ పాపిశెట్టి రాము



**ఆమనగల్లు, మే 03 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** ఆమనగల్లు పట్టణానికి చెందిన నాయి బ్రాహ్మణ సేవ సంఘం నాయకులు బిక్షపతి గత కొన్ని రోజులుగా అనారోగ్యానికి గురై బాధపడుతున్నారు. విషయం తెలుసుకున్న ప్రముఖ సంఘ సేవకులు, 5వ వార్డు కౌన్సిలర్ పాపిశెట్టి రాము శనివారం బిక్షపతి ని పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితి యోగక్షేమాలు అడిగి తెలుసుకుని అండగా ఉంటా అధైర్య పడొద్దు భరోసా కల్పించారు. తనవంతు సహాయంగా 10 వేల రూపాయలు అందజేశారు. ఆయన వెంట శ్రీను నాయక్, సైదులు గౌడ్ ఉన్నారు.

## ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభించిన జిల్లా ప్రధాన న్యాయమూర్తి శివకుమార్



**గన్నేరువరం, మే 3 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** గన్నేరువరం మండలం గునుకుల కొండాపూర్ గ్రామంలో సర్పంచ్ అజయ్ వర్మ, పంచాయతీ పాలకవర్గం ఆధ్వర్యంలో సుప్రీమ్ హాస్పిటల్స్ సహకారంతో ఏర్పాటు చేసిన ఉచిత మెగా వైద్య శిబిరాన్ని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎస్. శివకుమార్ ఆదివారం ప్రారంభించారు. లండన్‌లో శిక్షణ పొందిన డాక్టర్ తిరుపతి సిరవేణి ఆధ్వర్యంలో గ్రామస్తులకు బీపీ, షుగర్, సీబీపీ, ఈసీజీ పరీక్షలు నిర్వహించి ఉచిత మందులు అందజేశారు. ఉదయం ప్రారంభమైన ఈ శిబిరానికి గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై వైద్య సేవలు పొందారు. ఈ సందర్భంగా ప్రధాన న్యాయమూర్తి శివకుమార్ మాట్లాడుతూ న్యాయం, ఆరోగ్యం రెండూ ప్రతి పౌరుడి హక్కులని, గ్రామీణ ప్రాంతాల్లో ఇలాంటి సేవా కార్యక్రమాలు మరిన్ని జరగాలని అభిలషించారు. ప్రజల ఆరోగ్య రక్షణ కోసం శిబిరాన్ని ఏర్పాటు చేసిన నిర్వాహకులను అభినందించారు. సర్పంచ్ అజయ్ వర్మ మాట్లాడుతూ కరీంనగర్ వెళ్లలేని పేద ప్రజల కోసం ఈ శిబిరాన్ని ఏర్పాటు చేశామని, ప్రజల ఆరోగ్యమే తమకు ప్రథమ ప్రాధాన్యత అని తెలిపారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు లింగంపల్లి నాగరాజు, న్యాయవాదులు తుమ్మ ప్రభాకర్, జేరిపోతుల మహేందర్, పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు. గ్రామ ప్రజల ఆరోగ్య రక్షణకు ఉచిత వైద్య శిబిరం గర్వకారణమని జిల్లా ప్రధాన న్యాయమూర్తి శివకుమార్ పేర్కొన్నారు.

## జాతీయ స్థాయి సెస్టోబాల్ పోటీలకు గాయత్రి విద్యానికేతన్ విద్యార్థి ఎంపిక




**పెద్దపల్లి, మే 3 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** జగిత్యాలలో ఇటీవల జరిగిన రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ సెస్టోబాల్ క్రీడల్లో పెద్దపల్లి గాయత్రి విద్యానికేతన్ హై స్కూల్ విద్యార్థి ఎస్. వర సిద్దు ప్రతిభ కనబర్చి జాతీయ స్థాయికి అర్హత సాధించాడు. 9వ తరగతి చదువుతున్న వర సిద్దు పెద్దపల్లి జిల్లా తరఫున రాష్ట్రస్థాయిలో ప్రాతినిధ్యం వహించి మెరుగైన ప్రదర్శనతో జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. ఈ నెల 5 నుండి 7 వరకు హైదరాబాద్‌లో జరగనున్న జాతీయ స్థాయి పోటీల్లో ఆయన పాల్గొననున్నాడు. ఈ విజయంపై గాయత్రి విద్యాసంస్థల చైర్మన్ అల్లంకి శ్రీనివాస్ అభినందనలు తెలుపుతూ జాతీయ స్థాయిలో కూడా ప్రతిభ చాటాలని ఆకాంక్షించారు. పాఠశాల కరస్పాండెంట్ రజనీ దేవి, ప్రిన్సిపాల్ విజయ్, వ్యాయామ ఉపాధ్యాయుడు అజయ్ కుమార్, విద్యార్థి తండ్రి సంజీవ రాజ్ సంతోషం వ్యక్తం చేసి అభినందించారు. జాతీయ స్థాయిలో పోటీ పడనున్న వర సిద్దు విజయంపై పెద్దపల్లి విద్యా వర్గాలు గర్వం వ్యక్తం చేస్తున్నాయి.


# అడ్వకేట్ నాజియా కుదిజకు లైఫ్ మెంబర్ ఫెలో సభ్యత్వం



**కరీంనగర్, మే 3 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** అసోసియేషన్ ఆఫ్ అలయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ 137—ూా ఆధ్వర్యంలో ప్రముఖ అడ్వకేట్ నాజియా కుదిజ రూ.11,000 చెల్లించి ప్రతిష్టాత్మక లైఫ్ మెంబర్ ఫెలో సభ్యత్వాన్ని పొందారు. ఈ సందర్భంగా డాక్టర్ ఎలగందుల శ్రీనివాస్ ఆమెకు హృదయపూర్వక అభినందనలు తెలిపారు. నిరుపేదలకు, నిరాశ్రయులకు దుప్పట్లు, బెడ్‌షీట్లు పంపిణీ చేయడం, టవర్ సర్కిల్‌లో మినరల్ వాటర్ సదుపాయం కల్పించడం వంటి సేవా కార్యక్రమాలతో నాజియా కుదిజ ఎనలేని సేవలు అందించారని ఆయన కొనియాడారు. 30 దేశాల్లో విస్తరించిన అలయన్స్ క్లబ్‌లో లైఫ్ మెంబర్‌షిప్ విధానం ప్రత్యేకమని, విదేశీ స్వచ్ఛంద సంస్థల్లో ఇది లేనిదని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వాసుదేవ హాస్పిటల్ ప్రతినిధులు, డిస్ట్రిక్ట్ గవర్నర్ కొంజర్ల మహేష్, పండుగ నాగరాజు, అడ్వకేట్ అనూష రెడ్డి, సుద్దపల్లి ప్రసాద్, ముసుకుల సాగర్ రెడ్డి, కటుకూరి సుధాకర్, సోమవారపు వెంకన్న, పుల్లల శ్యామ్, మాటేటి శ్రీనివాస్, అల్లాడి ఆనంద్ కుమార్, ఇంజనీర్లు కోల అన్నారెడ్డి, కుమారస్వామి, గాలిపెల్లి నాగేశ్వరరావు, నేత్ర వైద్య నిపుణులు డాక్టర్ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు. సేవా కార్యక్రమాలతో గుర్తింపు పొందిన అడ్వకేట్ నాజియా కుదిజకు లైఫ్ మెంబర్ ఫెలో సభ్యత్వం గర్వకారణమని డాక్టర్ ఎలగందుల శ్రీనివాస్ అభినందించారు.


## జీవో-7ను ఉపసంహరించుకోవాలి

### - బీఆర్ఎస్వి రాష్ట్ర నాయకులు వర్షిత్



**ఆమనగల్లు, మే 03 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** స్టూడెంట్ల అకౌంట్లలోనే ఫీజు రీయింబర్స్‌మెంట్ జమ చేయాలని జారీ చేసిన జీవో నంబర్ 7ను వెంటనే ఉపసంహరించుకోవాలని బీఆర్ఎస్వి రాష్ట్ర నాయకులు మీసాల వర్షిత్ డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణ కేంద్రంలో ఒక ప్రకటనలో ఆయన మాట్లాడుతూ.. గతంలో మాదిరిగానే ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని కొనసాగించాలని సూచించారు. రూ.10 వేల కోట్ల ఫీజు బకాయిలు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. జీవో-7 ద్వారా నిరుపేద కుటుంబాలను ఆర్థికంగా దెబ్బ తీసేలా సీఎం వ్యవహారం ఉన్నదని మండిపడ్డారు. ఉమ్మడి రాష్ట్రంలో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ప్రవేశపెట్టిన ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని కేసీఆర్ మెరుగ్గా కొనసాగించారని, రేవంత్‌రెడ్డి ఎందుకు కొనసాగించడం లేదని నిలదీశారు.

## వివాహ వేడుకల్లో కాంగ్రెస్ నేతలు



**ఆమనగల్లు, మే 03 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణ కుమారుని వివాహం ఆదివారం రంగారెడ్డి జిల్లా మన్నెగూడ బిఎంఆర్ కన్వెన్షన్ హాల్లో జరిగింది. ఈ వివాహానికి ఆమనగల్లు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తెల్గమల్ల జగన్, ఐఎన్టీయుసీ జిల్లా అధ్యక్షుడు ఎంగలి ప్రసాద్, ఎన్ఎస్ఈయుఐ రాష్ట్ర కార్యదర్శి ఎండి ఫరీద్ హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వివాహ వేడుకలకు హాజరైన మంత్రి కొండా సురేఖను కలిసి ఆమెతో సెల్ఫీలు దిగారు. వారి వెంట శేఖర్ గౌడ్, సలీం తదితరులు ఉన్నారు.

## ట్రాన్స్‌ఫార్మర్ షార్ట్‌సర్క్యూట్‌తో ఘోర అగ్నిప్రమాదం



**హుస్నాబాద్, మే 3 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** : ఉల్లంపల్లి--సుందరగిరి రహదారి మార్గమధ్యంలో ఆకుల సంపత్ పొలం సమీపంలోని ట్రాన్స్‌ఫార్మర్ వద్ద షార్ట్‌సర్క్యూట్ జరగడంతో ఒక్కసారిగా మంటలు చెలరేగి స్థానికులు భయాందోళనకు గురయ్యారు. సమీపంలో పంట పొలాలు, గడ్డివాములు ఉండటంతో మంటలు వ్యాపిస్తాయేమోనని ప్రజలు తీవ్ర ఆందోళన చెందారు. ఈ ఘటనలో సుమారు 2.3 ఎకరాల ఖాళీ ప్రదేశంలో ఉన్న పలు చెట్లు దగ్ధమయ్యాయి. వివిధ రకాల చెట్లు కాలిపోవడంతో గణనీయమైన నష్టం సంభవించింది. సమాచారం అందుకున్న వెంటనే అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చారు. వారి సత్వర స్పందనతో సమీప పంట పొలాలు, గడ్డివాములకు ప్రమాదం తప్పింది. పెద్ద ప్రమాదాన్ని నివారించిన ఫైర్ సిబ్బందికి గ్రామస్తులు కృతజ్ఞతలు తెలుపుతూ ఊపిరి పీల్చుకున్నారు. అప్రమత్తంగా స్పందించిన అగ్నిమాపక సిబ్బంది పెద్ద ప్రమాదాన్ని తప్పించారు.

## హెచ్‌పీవీ వ్యాక్సిన్ వినియోగం అత్యంత అవసరం - మోడీ రవీందర్



**గంగాధర, మే 3(నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
కరీంనగర్ జిల్లా చొప్పదండి నియోజకవర్గం రామడుగు మండలంలోని ప్రభుత్వ ఆసుపత్రులను బీజేపీ మండల శాఖ అధ్యక్షుడు మోడీ రవీందర్ ఆధ్వర్యంలో పార్టీ నాయకులు సందర్శించారు. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మేకల ప్రభాకర్ యాదవ్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన హెచ్పీవి వ్యాక్సిన్‌ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.రామడుగు పీహెచ్సీలో ఇప్పటివరకు 112, గుండిగోపాలరావుపేట్ పీహెచ్సీలో 59 ఇంజెక్షన్లు మాత్రమే వేసినట్లు ఆయన తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చినా రాష్ట్ర ప్రభుత్వం, వైద్య అధికారులు ప్రజలకు అవగాహన కల్పించడంలో విఫలమయ్యారని విమర్శించారు. హెచ్పీవి వ్యాక్సిన్‌పై జిల్లా యంత్రాంగం తక్షణమే ప్రజలకు అవగాహన కల్పించి, ప్రభుత్వ ఆసుపత్రి సిబ్బంది ప్రజలకు వివరించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి పోచంపల్లి నరేష్, దళిత మోర్చా మండల అధ్యక్షుడు చంటి జితేందర్, యువ మోర్చా మండల అధ్యక్షుడు దురుశెట్టి రమేష్, యువ మోర్చా జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎడవెల్లి రామ్, యువ మోర్చా మండల ప్రధాన కార్యదర్శి ఎడవెల్లి లక్ష్మణ్, ఉప సర్పంచులు కుమ్మరి అనిల్, సంధపలుకల మహేందర్, బీర్ల వినోద్, మాదం శివ, బూత్ అధ్యక్షులు కడారి శ్రీనివాస్, వేముల శ్రీనివాస్, నాయకులు శేవెళ్ల అక్షయ్, పురేళ్ల శేఖర్, వడ్లూరి రాజేందర్, సాయిల్ రాకేష్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు. ప్రజల ఆరోగ్య రక్షణ కోసం హెచ్పీసీ వ్యాక్సిన్ వినియోగం అత్యంత అవసరమని మేకల ప్రభాకర్ యాదవ్ స్పష్టం చేశారు.


## వరి ధాన్యం కొనుగోలులో జాప్యం వద్దు

-- కలెక్టర్ హైమావతి



**సిద్ధిపేట, మే 3(నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
జిల్లాలో వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియలో ఎలాంటి ఆలస్యం జరగకుండా రైతులకు ఇబ్బందులు కలగనీయొద్దని కలెక్టర్ కె. హైమావతి అధికారులను ఆదేశించారు.శనివారం చేర్యాల మండలం వీరన్నపేట, మద్దూరు మండలం సలాక్‌పూర్ గ్రామాల్లోని కొనుగోలు కేంద్రాలను ఆకస్మికంగా సందర్శించిన కలెక్టర్, తేమ శాతం వచ్చి తాలు తీసిన ధాన్యాన్ని వెంటనే లిఫ్ట్ చేసి లారీలు లేదా ట్రాక్టర్ల ద్వారా కేటాయించిన మిల్లులకు తరలించాలని సిబ్బందిని ఆదేశించారు. ఒక కేంద్రానికి రెండు లేదా మూడు మిల్లులను కేటాయించి జాప్యం లేకుండా తరలింపులు జరగాలని సివిల్ సప్లై అధికారులకు ఫోన్ ద్వారా సూచనలు ఇచ్చారు. ప్యాడీ క్లీనర్లు చెడిపోతే వెంటనే మరమ్మతులు చేయాలని, వేయింగ్ మిషన్లు సహా అవసరమైన సదుపాయాలు కేంద్రాల్లో అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆమె స్పష్టం చేశారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియలో ఎక్కడా ఆలస్యం జరగకుండా సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ సంబంధిత అధికారులకు ఆదేశించారు.రైతులకు ఇబ్బందులు కలగకుండా వరి కొనుగోలు వేగవంతం చేయాలని కలెక్టర్ హైమావతి స్పష్టం చేశారు.

## భూ కబ్జాదారుల ముఠా అరెస్ట్



**కరీంనగర్, మే 3 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
నకిలీ పత్రాలతో అమాయకుల భూములను కబ్జా చేస్తున్న అంతర్రాష్ట్ర భూ కబ్జాదారుల ముఠాను కరీంనగర్ టూ టౌన్ పోలీసులు గుట్టురట్టు చేశారు. నలుగురు నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.పోలీసుల కథనం ప్రకారం కిన్నెర మల్లవ్వ, మర్రి వెంకటస్వామి, మహమ్మద్ బబ్లు, ఖలీదా బేగం కలిసి ముఠాగా ఏర్పడి యజమానులు అందుబాటులో లేని ఖాళీ స్థలాలను లక్ష్యంగా చేసుకున్నారు. ఈ క్రమంలో పద్మనగర్ ప్రాంతంలో షేక్ అహ్మద్, షేక్ హలీమాకు చెందిన భూమిపై నకిలీ పత్రాలు సృష్టించి తమలో తామే రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. అనంతరం ఆ భూమిని ఇతరులకు విక్రయించి భారీగా సొమ్ము చేసుకున్నారు. బాధితుడు షేక్ అహ్మద్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి లోతుగా దర్యాప్తు చేపట్టిన పోలీసులు పక్కా సమాచారంతో నిందితులను పట్టుకున్నారు. వారిని గౌరవ మెజిస్ట్రేట్ ముందు హాజరుపరిచారు. భూములు కొనుగోలు చేసేవారు పత్రాలను క్షుణ్ణంగా పరిశీలించాలని, అనుమానం వస్తే పోలీసులను లేదా రెవెన్యూ అధికారులను సంప్రదించాలని పోలీసులు సూచించారు. కబ్జాలకు పాల్పడితే ఎంతటి వారినైనా వదిలేది లేదని హెచ్చరించారు.

# మోదీ సభ విజయవంతం చెయ్యాలి

- మంత్రి బండి సంజయ్



**కరీంనగర్, మే 3(నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈ నెల 10న హైదరాబాద్‌లోని సికింద్రాబాద్ పరేడ్ మైదానంలో నిర్వహించే బహిరంగ సభను కనీవినీ ఎరగని రీతిలో విజయవంతం చేయాలని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ బీజేపీ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. రాష్ట్రంలోని ప్రతి కార్యకర్త స్వచ్ఛందంగా సభకు తరలిరావాలని, ముఖ్యంగా కరీంనగర్ జిల్లా నుండి అధిక సంఖ్యలో ప్రజలను సమీకరించాలని ఆయన సూచించారు.ఈరోజు కరీంనగర్ గాయత్రీనగర్‌లో బీజేపీ జిల్లా కార్యాలయ నూతన భవనానికి భూమి పూజ నిర్వహించిన బండి సంజయ్ అనంతరం జిల్లా అధ్యక్షుడు గంగాడి క్రిష్ణారెడ్డి ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోదీ సభ విజయవంతం కావడం ద్వారా రాష్ట్రంలో బీజేపీ విజయం తథ్యమనే సంకేతాలు ప్రజల్లోకి పంపవచ్చని అన్నారు.కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ కొలగాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ సునీల్ రావు, పార్టీ నేతలు బాస సత్యనారాయణ, కోమాల ఆంజనేయులు, గుగ్గిళ్ల రమేశ్, నల్లాల ఒదేలు తదితరులు సమావేశంలో పాల్గొన్నారు.తరువాత జ్యోతినగర్‌లో కేడీఆర్ పార్కు వద్ద రూ.16 లక్షల నిధులతో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలకు బండి సంజయ్, మేయర్ శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ సునీల్ రావు, స్థానిక కార్పొరేటర్ బోయినిపల్లి ప్రవీణ్ రావుతో కలిసి శంకుస్థాపన చేశారు. మోదీ సభ విజయవంతం చేయడం ద్వారా రాష్ట్రంలో బీజేపీ బలాన్ని ప్రజలకు చాటాలని బండి సంజయ్ పిలుపునిచ్చారు.

## ఘనంగా ఏఐవైఎఫ్ 67వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు







**హుస్నాబాద్/కరీంనగర్, మే 3 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) 67వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లోని అనబేరి సింగిరెడ్డి అమరుల భవన్‌లో, కరీంనగర్‌లోని బద్దం ఎల్లారెడ్డి భవన్‌లో వేడుకలు ఘనంగా జరిగాయి.హుస్నాబాద్‌లో జిల్లా అధ్యక్షుడు జనగాం రాజ్‌కుమార్ జెండా ఆవిష్కరించి మాట్లాడుతూ యువతకు విద్య, వైద్యం, ఉపాధి అవకాశాల సాధనకై ఏఐవైఎఫ్ నిరంతరం పోరాటం చేస్తోందని, ప్రభుత్వాలు ఉద్యోగ అవకాశాలు కల్పించడంలో విఫలమవుతున్నాయని విమర్శించారు.కరీంనగర్‌లో రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు పంజాల శ్రీనివాస్ జెండా ఆవిష్కరించి మాట్లాడుతూ 1958లో ఆవిర్భవించిన ఏఐవైఎఫ్ నిరుద్యోగం, ప్రైవేటీకరణ, సామాజిక అసమానతలపై 67 సంవత్సరాలుగా పోరాటం చేస్తోందని, యువతను మాదకద్రవ్యాల ఉచ్చులో పడకుండా చైతన్యపరచాల్సిన అవసరం ఉందని అన్నారు.ఈ రెండు కార్యక్రమాల్లో ఏఐవైఎఫ్ నాయకులు, యువజన సంఘాల ప్రతినిధులు, మహిళా నాయకులు, విద్యార్థి సంఘాల నేతలు పాల్గొన్నారు. విద్య, వైద్యం, ఉపాధి సాధనకై యువజన ఉద్యమాలను బలోపేతం చేయాలని ఏఐవైఎఫ్ నేతలు పిలుపునిచ్చారు.

## అభివృద్ధి పథంలో పోతేపల్లి

- సర్పంచ్ కొండల్ యాదవ్



**వెల్దండ, మే 3 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
పోతేపల్లి గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దడమే తన కర్తవ్యం అని సర్పంచ్ తగుళ్ల కొండల్ యాదవ్ తెలిపారు. ప్రజల్లో మమేకమై సమస్యలను పరిష్కరిస్తూ, సొంత నిధులతో గ్రామ అభివృద్ధి పనులు చేపడుతున్నానని ఆయన పేర్కొన్నారు.భారీ వర్షాల సమయంలో డ్రైనేజ్ పనులు వేగవంతంగా పూర్తి చేయించానని, వేసవిలో తాగునీటి ఎద్దడిని నివారించేందుకు కొత్త మోటార్ ఏర్పాటు చేసి ప్రజలకు మంచినీరు అందజేశానని వివరించారు. గ్రామ ప్రజలు కోరగానే సమస్యలు పరిష్కరించిన సర్పంచ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్, వార్డు సభ్యులు, బిఆర్ఎస్ నాయకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## అంగరంగ వైభవంగా శ్రీ వెంకటేశ్వర స్వామి కళ్యాణం



**గంగాధర, మే 3 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
కరీంనగర్ జిల్లా చొప్పదండి నియోజకవర్గం రామడుగు మండలంలోని మోతే గ్రామంలో సర్పంచ్, పాలకవర్గం ఆహ్వానం మేరకు నిర్వహించిన శ్రీ వెంకటేశ్వర స్వామి కళ్యాణోత్సవంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మేకల ప్రభాకర్ యాదవ్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కలియుగ ప్రత్యక్ష దేవుడు వెంకటేశ్వర స్వామి కళ్యాణంలో పాల్గొనడం ఎన్నో జన్మల పుణ్యఫలమని, ప్రజలంతా సుభిక్షంగా ఉండాలని దేవుని ప్రార్థించానని తెలిపారు.ఈ కార్యక్రమంలో మోతే గ్రామ సర్పంచ్ బత్తిని భవాని, ఉపసర్పంచ్ అనిల్, సుధాగోని మహేష్ గౌడ్, అంబటి శ్రీను, నర్సింగరావు, మామిడిపల్లి చెతన్య, రమేష్ తదితరులు పాల్గొన్నారు.వైభవంగా జరిగిన కళ్యాణోత్సవంలో గ్రామ ప్రజలు, నేతలు పాల్గొని భక్తి భావంతో స్వామి ఆశీర్వాదం పొందారు.

## ఇందుర్తి రేణుక ఎల్లమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు



**హుస్నాబాద్, మే 3 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
చిగురుమామిడి మండలం ఇందుర్తి గ్రామంలోని శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయంలో కరీంనగర్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి శివకుమార్, ప్రణీత దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారిని దర్శించుకుని పూజల్లో పాల్గొన్న దంపతులను ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ ప్రజలు శాలువాతో సన్మానించి ఘనంగా స్వాగతించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ చింతపూల నరేందర్, ఉపసర్పంచ్ అనిల్, లక్ష్మీ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, సీనియర్ జర్నలిస్టు గాదె రఘునాథ్ రెడ్డి, రైతు సంఘం అధ్యక్షుడు కాంతల శ్రీనివాస్ రెడ్డి, కంది శ్రీనివాస్ రెడ్డి, గౌడ్ సంఘం నాయకులు గట్టు రమేష్, బుర్ర స్వామి, ఆకుల శ్రీను, గట్టు మొగిలి, బుర్ర పరశురాములు, బత్తిని శ్రీనివాస్, రేణుక కార్యదర్శి సుమంత్, వార్డు సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.ఆలయ ప్రాంగణంలో భక్తి వాతావరణం నెలకొని, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## పేదల కల ఇందిరమ్మ ఇండ్లు కాంగ్రెస్ తోనే సాధ్యం



**హుస్నాబాద్, మే 3 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
అక్కంపేట మండలంలోని కేశ నాయక్ తండా గ్రామంలో జరిగిన ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశంలో కాంగ్రెస్ నేతలు పాల్గొన్నారు.ఈ సందర్భంగా వారు పేదలకు సొంత ఇల్లు కలను కాంగ్రెస్ ప్రభుత్వం నిజం చేస్తోందని తెలిపారు.మంత్రి పొన్నం ప్రభాకర్ చొరవతో అనేక ఇండ్లు మంజూరయ్యాయని పేర్కొన్నారు.లబ్ధిదారులు ఇల్లు పూర్తయి గృహప్రవేశం చేసుకోవడం ఆనందంగా ఉందని అన్నారు.గ్రామ సర్పంచ్ సులోచన, స్థానిక నేతలు పాల్గొన్నారు.

# ఫుడ్ కాంబినేషన్ భయం వద్దు..
# వాటర్‌మిలన్‌పై అపార్థాలు నమ్మొద్దంటున్న నిపుణులు

వేసవి కాలంలో శరీరానికి చల్లదనం, తేమను అందించే వాటర్‌మిలన్‌పై ఇటీవలి రోజులలో అనవసర భయాలు పెరుగుతున్నాయి. మహారాష్ట్రలో ఒక కుటుంబం బిర్యానీ తిన్న తర్వాత వాటర్‌మిలన్ తీసుకోవడంతో ఫుడ్ పాయిజనింగ్ కారణంగా మరణించారనే వార్తలు ప్రచారంలోకి రావడంతో చాలామంది ఈ పండును తినడానికే జంకుతున్నారు. అయితే ఈ ఘటనకు ప్రత్యేకంగా వాటర్‌మిలన్ కారణమని చెప్పడానికి ఎలాంటి స్పష్టమైన శాస్త్రీయ ఆధారాలు లేవని వైద్య నిపుణులు, ఆహార భద్రత అధికారులు స్పష్టం చేస్తున్నారు. వాటర్‌మిలన్ ఆరోగ్యానికి మేలు చేసే పండు. వాటర్‌మిలన్‌లో దాదాపు 92 శాతం నీరు ఉంటుంది. వేసవి వేడి నుంచి ఉపశమనం కలిగించడంలో, శరీరంలో నీటి కొరత తగ్గించడంలో ఇది ఎంతో ఉపయోగకరం. అధిక ఉష్ణోగ్రతల సమయంలో డీహైడ్రేషన్‌ను తగ్గించేందుకు ఇది సహజమైన మార్గంగా భావిస్తారు. భోజనం వెంటనే తింటే చిన్న అసౌకర్యాలు ఉండొచ్చు. హెవీ భోజనం చేసిన వెంటనే అధిక మొత్తంలో నీరు లేదా నీరు అధికంగా ఉండే పండ్లు తీసుకుంటే కొందరిలో జీర్ణక్రియ కొంత మందగించవచ్చు. దీంతో కడుపు ఉబ్బరం, అసౌకర్యం, ఎసిడిటీ వంటి చిన్న సమస్యలు రావచ్చు. అయితే ఇవి సాధారణ జీర్ణ సంబంధిత ఇబ్బందులే తప్ప ప్రాణాపాయం కలిగించే ప్రమాదం సాధారణంగా ఉండదని నిపుణులు



చెబుతున్నారు. బిర్యానీ–వాటర్‌మిలన్ కాంబినేషన్ ప్రాణాంతకమనే ఆధారాలు లేవు. బిర్యానీ, చపాతీ లేదా ఇతర ఆహారాలతో కలిపి వాటర్‌మిలన్ తింటే ప్రాణాపాయం జరుగుతుందనే వాదనలకు ఇప్పటివరకు ఎలాంటి శాస్త్రీయ నిర్ధారణ లేదని వైద్యులు స్పష్టం చేస్తున్నారు. ఒకటి రెండు సంఘటనలను ఆధారంగా తీసుకుని మొత్తం ప్రజల్లో భయం కలిగించడం సరైంది కాదని సూచిస్తున్నారు. వాటర్‌మిలన్ తీసుకునే ముందు జాగ్రత్తలు హెవీగా భోజనం చేసిన వెంటనే కాకుండా కొంత సమయం తర్వాత తీసుకుంటే మంచిది. కట్ చేసిన పండ్లను ఎక్కువసేపు బయట ఉంచకూడదు. అలా ఉంచితే బ్యాక్టీరియా, ఫంగస్ పెరిగే అవకాశం ఉంటుంది. ఫ్రెష్‌గా కోసిన పండ్లనే తీసుకోవడం ఆరోగ్యానికి మేలు. కొంతమందికి శరీర తత్వం బట్టి కొన్ని ఆహార కాంబినేషన్లు సరిపోకపోవచ్చు. కానీ దాన్ని అందరికీ వర్తింపజేసి భయపడాల్సిన అవసరం లేదు. వదంతులకు కాదు ఆరోగ్యానికి ప్రాధాన్యం ఇవ్వాలి. ఈ వేసవిలో శరీరాన్ని డీహైడ్రేషన్ నుంచి రక్షించే వాటర్‌మిలన్ వంటి సీజనల్ పండ్లను వదంతుల కారణంగా పక్కన పెట్టకూడదు. సీజనల్ ఫ్రూట్స్ శరీరానికి అవసరమైన పోషకాలు అందిస్తాయి. ఏదైనా ఆహారం తీసుకున్న తర్వాత అసౌకర్యం అనిపిస్తే వెంటనే వైద్యుడిని సంప్రదించడం మంచిది. ఆధారాలు లేని ప్రచారాలను నమ్మి భయపడాల్సిన అవసరం లేదని నిపుణులు సూచిస్తున్నారు.

వ్యాసకర్త
ఏ. రఘుమా రెడ్డి, బీఎస్సీ

# ప్రైవేట్ పాఠశాలలపై నిర్లక్ష్యమా - ఒప్పందమా?


**రంగారెడ్డి, మే 3 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
రంగారెడ్డి జిల్లాలోని ప్రైవేట్ పాఠశాలలపై ప్రభుత్వ విద్యాశాఖ అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారా, లేక పాఠశాలలతో ఒప్పందం చేసుకున్నారా అని హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఫర్ ఇండియా జిల్లా అధ్యక్షుడు ఆయిల్ శ్రీశైలం గౌడ్ ప్రశ్నించారు. ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాలను ఉల్లంఘిస్తూ తప్పుడు అనుమతులతో పాఠశాలలు నడుస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ఆయన విమర్శించారు. గత 20 ఏళ్లుగా యదేచ్ఛగా




పాఠశాలలు నడుస్తూ అధిక ఫీజులతో విద్యార్థులను మానసికంగా వేధిస్తున్న యాజమాన్యంపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విద్య ప్రాథమిక హక్కు (ఆర్టికల్ 21- ఏ) కింద ప్రైవేట్, అన్‌ఎయిడెడ్ పాఠశాలల్లో 25% సీట్లు బలహీన వర్గాలు, ఆర్థికంగా వెనుకబడిన పిల్లలకు ఉచితంగా ఇవ్వాలని చట్టం స్పష్టంగా పేర్కొన్నా అమలు జరగడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రైవేట్ పాఠశాలలపై తనిఖీలు నిర్వహించి మార్గదర్శకాలను కఠినంగా అమలు చేయాలని, లేనిపక్షంలో గుర్తింపును రద్దు చేయాలని ఆయన హెచ్చరించారు.

# 22- ఏ దురాగతం ప్రజల ఉసురుపోసే పాలన -- నరేష్ దండు

**హైదరాబాద్, మే 3 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
" నాలా పన్ను వసూలు చేసి అదే భూమిని ప్రభుత్వ భూమి అంటారా? ఇది చట్టవిరుద్ధం. 22-ఏతో పేదల ఉసురుపోసే పాలన జరుగుతోంది. ఇది ప్రజా ప్రభుత్వం కాదు, ప్రజా వ్యతిరేక పాలన" అంటూ పర్యావరణ పరిరక్షణ సమితి ఛైర్మన్ నరేష్ దండు తీవ్రంగా విమర్శించారు. రెవెన్యూ శాఖపై మండిపడుతూ ఆయన అన్నారు: "భూ భారతి అని గొప్పలు చెప్పుకుంటూ, క్షేత్రస్థాయిలో మాత్రం పేదల ఇళ్లను కూల్చి, పెద్దల అక్రమాలను వదిలేస్తున్నారు. ఒక చేత్తో నాలా పన్ను తీసుకుని, ఇంకో చేత్తో అదే భూమిని ప్రభుత్వ భూమి అంటారా? ఇది మోసం కాదా? ఇది ప్రజలను దోచుకునే పాలన" అని ప్రశ్నించారు. నాదర్‌గుల్





సర్వే నం.196ను కలెక్టర్ లేఖ ద్వారా టీజీఐఐసీ భూమిగా ప్రకటించి 22-ఏలో పెట్టడం చట్టవిరుద్ధమని ఆయన పేర్కొన్నారు. "ధరణి రికార్డుల్లో ఇది నాలా లాండ్గా, ఇళ్లతో ఉన్న ప్రైవేట్ భూమిగా స్పష్టంగా ఉంది. ఖాతా ఇచ్చిన భూమిని 22-ఏలో పెట్టడం జీఓ.40కి విరుద్ధం" అని నరేష్ దండు అన్నారు. ప్రజల హక్కులను కాలరాస్తున్న ఈ చర్యలపై ఆయన తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తూ, "కోర్టుకి వెళ్ళైనా మా హక్కు సాధించుకుంటాం. ప్రజల ఆస్తి హక్కును కాపాడే వరకు పోరాటం ఆగదు" అని స్పష్టం చేశారు.

# ప్రజలకు ఇబందుల్లేకుండా చర్యలు

**- మున్సిపల్ కమిషనర్ రాఘవేందర్ రెడ్డి**

**ఆమనగల్లు, మే 03 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
ఆమనగల్లు మున్సిపాలిటీ ప్రజలకు ఇబ్బంది లేకుండా అన్ని రకాల చర్యలు చేపడుతున్నట్లు మున్సిపల్ కమిషనర్ రాఘవేందర్ రెడ్డి పేర్కొన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని 9వ వార్డులో కౌన్సిలర్ ఎర్రవోలు మహేష్ తో కలిసి ఆదివారం పర్యటించారు. కళ్యాణి గార్డెన్ వెనుక వైపు భారీగా చెత్త చెదారంతో దుర్గంధం వెదజల్లుతుందని



కౌన్సిలర్ మరియు కాలనీవాసులు కమిషనర్ దృష్టికి తీసుకువచ్చారు. దీనికి సంబంధించిన కమిషనర్ మున్సిపల్ సిబ్బందితో తొలగించారు. పట్టణ పరిశుభ్రతలో భాగంగా ప్రజలందరూ చెత్తను వేరుచేసి డస్ట్ బిన్‌ల ద్వారా తమ ఇంటి ముందుకు వచ్చే మున్సిపల్ పారిశుధ్య వాహనములకు అందజేసి, పట్టణము పరిశుభ్రంగా ఉంచుటకు సహకరించాలని కమిషనర్ రాఘవేందర్ రెడ్డి కోరారు.

# రోడ్డు భద్రతను మెరుగుపరిచే లక్ష్యంతో విస్తృత నాఖాబందీ

**-- స్పెషల్ డ్రైవ్లో వందలాది వాహనాలు సీజ్**



**కరీంనగర్, మే 3 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం ఆదేశాల మేరకు కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో శాంతి భద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణ, రోడ్డు భద్రతను మెరుగుపరిచే లక్ష్యంతో విస్తృత నాఖాబందీ మరియు స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. టౌన్ ఏసిపి వెంకటస్వామి పర్యవేక్షణలో నగరంలోని ప్రధాన కూడళ్లలో, సరిహద్దు ప్రాంతాల్లో వాహనాలు, అనుమానాస్పద వ్యక్తులను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. డ్రగ్ డిటెక్టివ్ డాగ్ లియో సహాయంతో డ్రగ్స్ మరియు నిషేధిత వస్తువుల అక్రమ రవాణా అరికట్టేందుకు ప్రత్యేక తనిఖీలు జరిగాయి. అలాగే డ్రంకన్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించి మద్యం సేవించి వాహనం నడిపిన వారిపై కేసులు నమోదు చేశారు. ఈ డ్రైవ్‌లో సరైన ధృవపత్రాలు లేని 82 వాహనాలు, నంబర్ ప్లేట్ లేని 21 వాహనాలు, డ్రంక్ అండ్ డ్రైవ్‌లో 35 కేసులు, మైనర్ డ్రైవింగ్‌లో 2 కేసులు, ఇతర ఉల్లంఘనలపై 139 కేసులు నమోదు చేసి వాహనాలను సీజ్ చేశారు. సిపి గౌష్ ఆలం మాట్లాడుతూ చట్టాన్ని ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తప్పవని, ప్రజల భద్రత కోసం ఇటువంటి స్పెషల్ డ్రైవ్‌లు నిరంతరం కొనసాగుతాయని హెచ్చరించారు. వాహనదారులు తప్పనిసరిగా లైసెన్స్, ఆర్సీ, ఇన్సూరెన్స్ పత్రాలు కలిగి ఉండాలని, మైనర్లకు వాహనాలు ఇవ్వడం, మద్యం సేవించి వాహనం నడపడం కఠిన శిక్షలకు దారితీస్తుందని పోలీసులు హెచ్చరించారు.

# ప్లాస్టిక్ మృత్యుజాలం

**-అంతర్వేదిలో పశువు మృతి**



**అంతర్వేది, మే 2 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
తీరప్రాంతంలో నిర్లక్ష్యంగా పారేసిన ప్లాస్టిక్ వ్యర్థాలు ఓ పశువుకు ప్రాణాంతకమయ్యాయి. ఆకలితో ప్లాస్టిక్ సంచులను ఆహారంగా భావించి మింగిన పశువు చివరికి మృతి చెందింది. జంతువు శరీరం కుళ్లి అస్థిపంజరంగా మారినా, కడుపులోని ప్లాస్టిక్ మాత్రం అలాగే ఉండటం ప్లాస్టిక్ ప్రమాదకరతను స్పష్టంగా చూపిస్తోంది. పర్యావరణ ప్రేమికులు ఆవేదన వ్యక్తం చేస్తూ, నిర్లక్ష్యంగా పారేసే ప్లాస్టిక్ వ్యర్థాల వల్ల వేలాది మూగజీవాలు ప్రాణాలు కోల్పోతున్నాయని హెచ్చరించారు. ఇప్పటికైనా ప్రజలు మేల్కొని ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించి ప్రకృతిని కాపాడాలని విజ్ఞప్తి చేశారు.

# ఆడబిడ్డ పెళ్లికి ఆర్థిక సహాయం

**తలకొండపల్లి, మే 3 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
చుక్కాపూర్ గ్రామానికి చెందిన కాలూరి రాములు కూతురు లావణ్య వివాహానికి ఆర్థిక సహాయం అందిస్తూ కాగుల కుమార్ యాదవ్ ముందుకొచ్చారు. వివాహానికి రూ. 10,000 నగదు, 100 కేజీల బియ్యం అందజేసి



కుటుంబానికి తోడ్పాటు అందించారు. ఈ సందర్భంగా గ్రామస్థులు, స్థానికులు పాల్గొన్నారు.

# షార్ట్ సర్క్యూట్‌తో ట్రాన్స్‌ఫార్మర్ దగ్ధం

**మర్రిగూడ, మే 3 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
మర్రిగూడ మండల కేంద్రంలోని రాంరెడ్డి పల్లి గ్రామపంచాయతీ పరిధిలో ఆదివారం విద్యుత్ ప్రమాదం సంభవించింది. చండూరు మాల్ ప్రధాన రహదారి పక్కన రైతు అబ్బనగోని వెంకటయ్య వ్యవసాయ పొలంలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ షార్ట్ సర్క్యూట్ కారణంగా ఒక్కసారిగా మంటల్లో చిక్కుకొని దగ్ధమైంది. ప్రమాదాన్ని గమనించిన స్థానిక రైతులు వెంటనే విద్యుత్ అధికారులకు సమాచారం అందించడంతో విద్యుత్ సరఫరా నిలిపివేశారు.



## ఎవరిని ఆరాధించాలి..!?

దేవుడా..!
ఎవరిని ఆరాధించాలి....?
ఏ దేవున్ని పూజించాలి..?
తెలియక రోజూ చస్తున్నామ్
నిత్యం మా బ్రతుకులు మావే

కులానికో దేవుడు....!
మతానికో దేవుడు..!!
ఏ కుల దేవున్ని ఆరాధించాలి
ఏ మత దేవున్ని పూజించాలి
అందరం మానవులమే కదా..!

రోజుకో దేవత వెలుస్తున్నది
పూటకో దేవుడు పుడుతుండు
దేవుడు వున్నాడని ఆస్తికులు
దేవుడు లేనేలేడని నాస్తికులు

ఎవరి వాదనలు వారివి
యెవరి గొప్పలు వారివి
చర్చలు యెన్ని జరిగినను
నిరూపణకు ముందుకురారు

భగవద్గీతా-బైబిల్-ఖురాన్
పవిత్ర మైన మత గ్రంథాలు
ఏ నిఘంటులో ఏముందో
ఈ కుల-మతాల పరమార్థం

కులాల మధ్య పోట్లాటలు
మతాల మధ్య ఘర్షణలు
పేరుకే మనం భారతీయులం
అనైక్యతలో అహంభావులు

పూజలు-ప్రార్థన-నమాజ్
మూడింటి అర్థం ఒకటైతే
ఎవరికి వారు నమ్మకంతో
ఇంట్లో కొలిస్తే సరిపోదామరీ

కనిపించని దేవుని కోసం
ఎక్కడెక్కడో ప్రయాణాలు
తీరని కోరికల ప్రవాహాలు
నడీ రోడ్డులో ఘోర ప్రమాదాలు
గాలిలోన కలుస్తున్నవి ప్రాణాలు

ఆకారము లేని దేవునికి
ఎన్నో రూపాలను సృష్టించి
దేవుళ్ళ పేర్లను చెబుతూ
చందాలకు జోరుగా దిగుతున్నరు
ముప్పది మూడుకోట్ల దైవభక్తులు

భక్తి ముసుగులో ప్రజలు
పూనకాలతో మూల్గుతున్నరు
భయభ్రాంతిలో బ్రతుకుతున్నరు
శాస్త్రీయతకు ఆమడ దూరము

సుఖ జీవనము కోసం
దేవునిపైనే రాజకీయాలు
దొంగ స్వాముల మైకంలో
మోసపోతున్న భక్త జనాలు
నాగరికతలో అమాయకులు

కుల మతాల మధ్యలో
చిచ్చును రగిలించి రాజ్యమేలు
నేటి రాజకీయ స్వార్థ నేతలు
చరిత్రలో చిరస్థాయి సంస్మరణం

ఇందు గలడని అందు గలడని
ఎందెందు వెతికినా అందెగలడని
ప్రబోధించే ఓ విశ్వ రూపుడా.....!
చర్చీ-మసీద్-మందిరాలకే.......!!
ఎందుకు అంకిత మయ్యావు...!?

కనిపెంచిన జననీజనకులు
చదువు నేర్పిన గురువులు
ఆపదలో ఆదుకున్న వాండ్లు
మన భారతీయ త్యాగధనులు
వెలుగునిచ్చే సూర్యచంద్రులు
ప్రకృతీ పర్యావరణాలు కాదా
కనిపించి నడిపించే దేవుళ్ళూ

పూజ పూజగదిలోనే ఆగిపోవాలి
మతం ఇంటిగడప దాటకూడదు
మనం బయటకు వెళితే అందరం
భారతీయులం అన్నదమ్ములం
అన్న సందేశం ఇవ్వు దయదలచి
దేవుడా..! స్వరూప విశ్వవ్యాప్తుడా

**డా"జోగు కృష్ణయ్య**
**రంగారెడ్డి జిల్లా**



## వేసవిలో అగ్ని ప్రమాదాలపై
# అప్రమత్తంగా ఉండాలి

- ప్రజలకు జిల్లా అగ్నిమాపక అధికారి శ్రీనివాస్ రెడ్డి సూచనలు

**కరీంనగర్, మే 3 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** వేసవికాలంలో అధిక ఉష్ణోగ్రతల కారణంగా అగ్ని ప్రమాదాలు సంభవించే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని జిల్లా అగ్నిమాపక అధికారి శ్రీనివాస్ రెడ్డి హెచ్చరించారు. ప్రజలంతా అప్రమత్తంగా ఉండి అగ్ని ప్రమాదాల నివారణకు సహకరించాలని కోరారు.ముఖ్యంగా పొలాల్లో కోసిన గడ్డి, ఎండిన పంట అవశేషాలు, ఊరి బయట ఉన్న చెట్లు, ఆరుబయట నిల్వ ఉంచిన మండే పదార్థాలు వివిధ కారణాలతో అగ్నికి ఆహుతయ్యే ప్రమాదం ఉందన్నారు. ఇటువంటి ఘటనలు సమీపంలోని నివాస గృహాలు, వాహనాలకు కూడా ముప్పుగా మారే అవకాశం ఉందని తెలిపారు.వేసవిలో విద్యుత్ వినియోగం పెరగడంతో ఏసీలు, కూలర్లు, విద్యుత్ ఆధారిత వాహనాలు, ఇతర ఎలక్ట్రికల్ పరికరాల వాడకంలో నిర్లక్ష్యం వహిస్తే అగ్ని ప్రమాదాలు సంభవించే ప్రమాదం ఉందన్నారు. ఇటీవల అపార్ట్‌మెంట్లు, వాణిజ్య భవనాల్లో చోటుచేసుకున్న అగ్ని ప్రమాదాలు ప్రాణనష్టం కలిగించే పరిస్థితులు



సృష్టిస్తున్నాయని పేర్కొన్నారు.గత నెల 14వ తేదీ నుంచి 20వ తేదీ వరకు నిర్వహించిన అగ్నిమాపక వారోత్సవాల సందర్భంగా మాల్స్, హాస్పిటళ్లు, పెట్రోల్ బంకులు, పాఠశాలలు, కళాశాలలు, వాణిజ్య సముదాయాల్లో తీసుకోవాల్సిన అగ్ని భద్రతా చర్యలపై ప్రజలకు అవగాహన కల్పించినట్లు తెలిపారు. ఏదైనా అగ్ని ప్రమాదం సంభవించిన వెంటనే 101 నంబర్‌కు కాల్ చేసి అగ్నిమాపక శాఖ సేవలను వినియోగించుకోవాలని విజ్ఞప్తి చేశారు. బహుళ అంతస్తుల భవనాల్లో మెట్ల మార్గాలను ఎట్టి పరిస్థితుల్లోనూ మూసివేయరాదు. అత్యవసర మార్గాల్లో వస్తువులు నిల్వ చేయకూడదు. కొత్త ప్రదేశాలకు వెళ్లినప్పుడు ముందుగానే ఎమర్జెన్సీ ఎగ్జిట్ మార్గాలను తెలుసుకోవాలి.అపార్ట్‌మెంట్ సెలార్లలో నివాసం ఉండకూడదని, మండే పదార్థాలు నిల్వ చేయరాదని సూచించారు. సెలార్లలో విద్యుత్ వాహనాలకు ఛార్జింగ్ పెట్టరాదన్నారు. కార్లను సమయానుకూలంగా సర్వీసింగ్ చేయించడంతో పాటు రేడియేటర్, టైర్లలో తగిన స్థాయిలో నీరు, గాలి ఉండేలా చూసుకోవాలని సూచించారు.గ్యాస్ పైపులు, రెగ్యులేటర్లను నిర్ణీత కాల వ్యవధిలో మార్చుకోవాలని, చిన్న నిర్లక్ష్యమే పెద్ద ప్రమాదానికి దారితీస్తుందని హెచ్చరించారు. ప్రజలంతా అప్రమత్తంగా ఉండి అగ్ని ప్రమాదాల నివారణలో భాగస్వాములు కావాలని జిల్లా అగ్నిమాపక అధికారి శ్రీనివాస్ రెడ్డి కోరారు.

## ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకానికి
# మంగళం పాడుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం

-బిఆర్ఎస్వీ రాష్ట్ర నాయకులు బొడ్డుపల్లి కృష్ణ .

**దేవరకొండ మే 03 (నీలగిరి ఎక్స్ ప్రెస్).** ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకానికి కాంగ్రెస్ ప్రభుత్వం మంగళం పడుతుంది అని బిఆర్ఎస్వీ రాష్ట్ర నాయకులు బొడ్డుపల్లి కృష్ణ అన్నారు. ఆదివారం దేవరకొండ పట్టణంలో ఆయన మాట్లాడుతూ......కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 30 నెలలు గడుస్తున్న రూ. 10,000 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వలేదు అని ఆయన అన్నారు.ఫీజు రీయింబర్స్‌మెంట్ రాక విద్యార్థులు కోర్సు పూర్తయినా సర్టిఫికెట్లు లేక 14 లక్షల మంది విద్యార్థుల పడిగాపులు గస్తున్నారు అని ఆయన పేర్కొన్నారు.గతంలో మాదిరిగానే విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం అమలు చేయాలి



ఆయన ప్రభుత్వాన్ని కోరారు.నిరుపేద కుటుంబాలకు ఆర్థికంగా దెబ్బతీసేలా రేవంత్ రెడ్డి ప్రభుత్వం కుట్ర చేస్తుంది అని ఆయన అన్నారు.విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ రూ. 10వేల కోట్ల బకాయిలు వెంటనే విడుదల చేయాలి అని ఆయన డిమాండ్ చేశారు.విద్యావ్యవస్థను సర్వనాశనం చేస్తున్న అసమర్థ కాంగ్రెస్ ప్రభుత్వం అని ఆయన అన్నారు.రెండున్నర ఏండ్లుగా యువత ఉద్యోగాల కోసం ఎదురు చూస్తుంటే ఈ ప్రభుత్వం నోటిఫికేషన్లు ఇవ్వలేదు అని ఆయన తెలిపారు.జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలి, రెండు లక్షల ప్రభుత్వ ఉద్యోగాలకు నోటిఫికేషన్లు ఇవ్వాలని అని ఆయన డిమాండ్ చేశారు.మెగా డీఎస్సీ అంటూ ఊరించి ఊరించి దగా డీఎస్సీ అయ్యింది అని ఆయన తెలిపారు.ఖాళీగా ఉన్న ఎస్ జి టి స్కూల్ అసిస్టెంట్ పోస్టులకు మెగా డీఎస్సీ విడుదల చేయాలి అని ఆయన కోరారు.

## విద్యార్థికి స్కాలర్‌షిప్ చెక్కు అందజేత



**ఎలిగేడు, మే 3 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** సుల్తాన్‌పూర్ గ్రామానికి చెందిన చిట్కూరి గణేష్కు రూ.12,000ల స్కాలర్‌షిప్ చెక్కును బాసర ట్రిపుల్ ఐటీలో చదువు పూర్తి చేసిన సందర్భంగా బహుజన ఏకలవ్య ఫౌండేషన్, కరీంనగర్ ఏకలవ్య స్వచ్ఛంద సేవా సంస్థల ఆధ్వర్యంలో అందజేశారు.ఫౌండేషన్ ఉపాధ్యక్షులు దొడ్డపనేని దివ్య--రాములు దంపతుల వివాహ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఈ సహాయం అందించగా, చెక్కును సర్పంచ్ కవ్వంపెల్లి బాపయ్య, మాజీ సర్పంచ్ అర్షనపల్లి వెంకటేశ్వరరావు చేతుల మీదుగా గణేష్ స్వీకరించాడు.ఈ కార్యక్రమంలో తానిపర్తి రమేష్ రావు, మానుపాటి రాజయ్య, మొగిలి శ్రీనివాస్, ముద్రవేని అనిల్తో పాటు పలువురు గ్రామస్థులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే వంశీకృష్ణ కుమారుని వివాహ వేడుకల్లో యాట నర్సింహ

**ఆమనగల్లు, మే 03 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణ కుమారుని వివాహం అదివారం రంగారెడ్డి జిల్లా మన్నెగూడ బిఎంఆర్ కన్వెన్షన్ హాల్లో జరిగింది. ఈ వివాహానికి ఆమనగల్లు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నరసింహ



ముదిరాజ్ హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. నరసింహతోపాటు విద్యా కమిషన్ మెంబర్ చారగొండ వెంకటేష్ ఉన్నారు.

## శ్రీ కంఠమహేశ్వర స్వామి విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవం లో పాల్గొన్న సుంకిరెడ్డి



**వెల్దండ, మే 3 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** వెల్దండ మండలంలోని కొట్ర గ్రామంలో శ్రీ కంఠమహేశ్వర స్వామి విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరైన ఐక్యత ఫౌండేషన్ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి ప్రత్యేక పూజల్లో పాల్గొని స్వామివారి దర్శనం చేసుకున్నారు.గతంలో ఇచ్చిన హామీని నిలబెట్టుకుంటూ రూ.2.80 లక్షల వ్యయంతో ఆలయానికి పెయింటింగ్ పనులు, అభివృద్ధి కార్యక్రమాలు పూర్తి చేసినందుకు గ్రామస్థులు ఆయనకు కృతజ్ఞతలు తెలుపుతూ ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా రాఘవేందర్ రెడ్డి మాట్లాడుతూ, “దేవాలయం అంటే కేవలం పూజల స్థలం కాదు, గ్రామ ఐక్యతకు కేంద్రబిందువు. అందుకే గ్రామాల అభివృద్ధితో పాటు ఆలయాల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తాను. ఇలాంటి కార్యక్రమాలకు నా సహకారం ఎల్లప్పుడూ కొనసాగుతుంది” అని హామీ ఇచ్చారు.ఈ మహోత్సవంలో ఆలయ కమిటీ సభ్యులు నాగరాజు గౌడ్, అంజయ్య గౌడ్, వెంకటయ్య గౌడ్, సాయిలు గౌడ్, మల్లయ్య గౌడ్, నాగేష్ గౌడ్, సైదులు గౌడ్, సిద్దయ్య గౌడ్, జంగయ్య గౌడ్, శ్రీనివాసులు గౌడ్, లక్మయ్య గౌడ్తో పాటు గ్రామస్థులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## నేటి నుండి రైతులకు అవగాహన సదస్సులు

**ఎలిగేడు, మే 3 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** ప్రజాపాలన--ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా ఎలిగేడు మండలంలోని రైతులకు వ్యవసాయశాఖ అధికారులు, శాస్త్రవేత్తలు అవగాహన సదస్సులు నిర్వహించనున్నట్లు మండల వ్యవసాయ అధికారి ఎం. ఉమాపతి తెలిపారు.ఈ నెల 4న ధూళికట్ట రైతువేదికలో, 5న ఎలిగేడు రైతువేదికలో, 6న సుల్తాన్‌పూర్ రైతువేదికలో ఉదయం 8.30 గంటల నుండి 11 గంటల వరకు సదస్సులు జరుగుతాయని ఆయన వివరించారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఉమాపతి కోరారు.




## ఇది ప్రజా ప్రభుత్వమా
# పనికిరాని ప్రభుత్వమా?

**- నరేష్ దండు**



**హైదరాబాద్, మే 3 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** "మొన్నటి వరకు గ్రామాల్లో అధికారుల పాలనతో సమస్యలు. ఇప్పుడు మున్సిపాలిటీ, కార్పొరేషన్‌లలో ప్రత్యేక పాలన పేరుతో అదే దుస్థితి. ఇది ప్రజా ప్రభుత్వం కాదు, ప్రజా వ్యతిరేక పాలన" అంటూ పర్యావరణ పరిరక్షణ సమితి ఛైర్మన్ నరేష్ దండు మండిపడ్డారు. మంత్రులు సమస్యలపై సమీక్ష చేయడం లేదని, ప్రతిదీ బడ్జెట్‌తో ముడిపెట్టి తప్పించుకుంటున్నారని ఆయన విమర్శించారు. "ఫైల్ కదలాలంటే బడ్జెట్ లేదు అంటారు. మరి అధికారులు చేయాల్సిన రోజువారీ పనులు ఎందుకు చేయడం లేదు?" అని ప్రశ్నించారు. మంత్రులు, ఎమ్మెల్యేలు ప్రజలకు సమయం ఇవ్వకుండా ప్రైవేట్ ఆఫీసులు, హాస్పిటల్స్, కాలేజీలు, షాపింగ్ మాల్స్ ప్రారంభోత్సవాలకు వెళ్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. "కుటుంబాలతో గంటల తరబడి వీఐపీ దర్శనాలకు సమయం కేటాయిస్తారు. కానీ ఆఫీసుల్లో పేరుకుపోయిన ఫైళ్లపై సంతకాలు పెట్టడం లేదు. ఒక్క మంత్రి, శాసన సభ్యుడు ప్రజలకు అందుబాటులో లేరు" అని మండిపడ్డారు. కలెక్టర్ ఆఫీసులో జరిగే ప్రజా దర్బార్‌ను ఆయన లి"ఉట్టి బోగస్"లిగా అభివర్ణించారు. "ఒక్క సమస్యా పరిష్కారం కావడం లేదు. ప్రజా పాలన అని గొప్పలు పలుకుతున్నారో అర్థం కావడం లేదు. రాజ్యాంగ మర్యాదలు పక్కన పెట్టి, పేదల బతుకులు రోడ్డున పడేస్తున్నారు" అని ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామం నుంచి కార్పొరేషన్ దాకా ఒకే దుస్థితి కొనసాగుతోందని, లంచం ఇస్తే తప్ప ఫైల్ కదలదని ఆయన ఆరోపించారు. "మళ్ళీ ప్రభుత్వం వస్తుందో రాదో అనే భయంతో అందిన కాడికి దోచుకోవడం, రాజ్యాంగ మర్యాదలు అనుభవించడం చేస్తున్నారు. పేర్లు మారాయి, పథకాలు మారాయి, కానీ దోపిడీ మాత్రం అలాగే ఉంది" అని నరేష్ దండు వ్యాఖ్యానించారు. "కాగితాలపై ఉన్న జీ.వోలు క్షేత్రస్థాయిలో అమలు కావడం లేదు. ఫీల్డ్‌లోకి వచ్చి చూస్తే అసలు పరిస్థితి తెలుస్తుంది. ఇది ప్రజా వ్యతిరేక పాలన కాకపోతే మరేంటి?" అని ఆయన నిలదీశారు.

# కన్నుల పండుగగా శ్రీ వేంకటేశ్వర స్వామి రథోత్సవం


రథంపై ఆశీస్సులు అయిన ఉత్సవ దేవత మూర్తులు


దర్శనం కోసం బారులు తీరిన భక్తులు


ఆలయ ప్రాంగణంలో మహా అన్న ప్రసాదం వితరణ


స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్న రాష్ట్ర యువజన కాంగ్రెస్ నాయకులు దుగ్యాల సంతోష్ రావు

**ఎలిగేడు, మే 3 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** ఎలిగేడు మండలంలోని ముప్పిరితోట గ్రామంలో శ్రీమదఖిలాండకోటి బ్రహ్మాండ నాయకుడగు శ్రీ మదలమేల్మంగా సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం కన్నుల పండుగగా రథోత్సవం వైభవంగా జరిగింది. రథంపై ఉత్సవ విగ్రహాలను ఆలయం నుండి గ్రామ ప్రధాన రహదారి వరకు భక్తులు భక్తిశ్రద్ధలతో లాగుతూ తీసుకువెళ్లారు. అనంతరం భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయంలో దేవతామూర్తులను దర్శించుకుని, రథంపైకి ఎక్కి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయంలో పగలు చక్రతీర్థం, బలిహరణం, సాయంత్రం పుష్పయాగం, ధ్వజారోహణం, బూతాబలి, సప్తవర్ణాల సేవ వంటి ప్రత్యేక కార్యక్రమాలు వైభవంగా నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుండి వేలాదిగా తరలివచ్చిన భక్తులకు మహా అన్నప్రసాదం అందజేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నిర్వాహకులు అన్ని సౌకర్యాలను కల్పించారు. గత పది రోజులుగా కొనసాగిన బ్రహ్మోత్సవాలు రథోత్సవంతో ముగిశాయి. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధానార్చకులు కొండపాక రామాచార్యులు, ఆలయ నిర్వాహకులు, గ్రామస్థులు, భక్తులు పాల్గొన్నారు.

# ప్రపంచ పత్రికా స్వేచ్ఛ దినోత్సవ శుభాకాంక్షలు

**-- ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి**



**కల్వకుర్తి, మే 3 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ప్రపంచ పత్రికా స్వేచ్ఛ దినోత్సవం సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ప్రజలకు, ముఖ్యంగా జర్నలిస్టులకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ప్రజాస్వామ్యానికి పత్రికా స్వేచ్ఛ ప్రాణాధారం అని, సమాజంలో సత్యాన్ని వెలికితీసే బాధ్యతను మీడియా నిర్వర్తిస్తోందని ఆయన పేర్కొన్నారు. పత్రికలు, మీడియా సంస్థలు ఎలాంటి ఒత్తిళ్లు లేకుండా స్వేచ్ఛగా పనిచేసే వాతావరణం ఉండాలని అభిప్రాయపడ్డారు. ప్రజల సమస్యలను ప్రతిబింబిస్తూ, ప్రభుత్వ పనితీరును సమీక్షిస్తూ, సమాజానికి దిశానిర్దేశం చేసే పాత్రలో మీడియా ఎంతో కీలకమని ఆయన అన్నారు. జర్నలిస్టులు వృత్తి నిబద్ధతను కాపాడుకుంటూ నిజాయితీగా పనిచేయాలని ఆకాంక్షించారు. "మీడియా స్వేచ్ఛను పరిరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత. ప్రజాస్వామ్య విలువలను నిలబెట్టడంలో మీడియా పాత్ర మరింత బలోపేతం కావాలి" అని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి స్పష్టం చేశారు.

# అగ్నికి ఆహుతి అయిన మొక్కజొన్న పంట



**నాగర్‌కర్నూలు, ఏప్రిల్ 3 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** బిజినేపల్లి మండలంలోని అల్లిపూర్ గ్రామానికి చెందిన రైతు డొక్కా శ్రీనివాసులు మొక్కజొన్న పంట విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ నుంచి ఎగిరిన నిప్పురవ్వలతో అగ్నికి ఆహుతైంది. పొలంలో మంటలు వ్యాపించడంతో మొత్తం పంట బూడిదైపోయింది. చుట్టుపక్కల రైతులు విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం వల్లే ఈ ప్రమాదం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. అప్పులు చేసి పంట సాగు చేసిన రైతు శ్రీనివాసులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తూ, "ఇప్పుడు ఈ నష్టాన్ని ఎలా భరించాలి?" అని వేదనతో తెలిపారు. గ్రామ ప్రజలు, రైతులు విద్యుత్ శాఖ అధికారులు రైతు బాధను అర్థం చేసుకుని తగిన నష్టపరిహారం చెల్లించాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

# ఆరోగ్యమే గొప్ప సంపద

**- కలెక్టర్ బి. చంద్రశేఖర్**



**నల్లగొండ, మే 3 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** "మనిషికి ఆరోగ్యమే గొప్ప సంపద" అని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ పేర్కొన్నారు. సొసైటీ ఫర్ తెలంగాణ రన్ ఆధ్వర్యంలో, అవంతిక కన్స్ట్రక్షన్స్, ఆరోగ్య హాస్పిటల్స్ సహకారంతో ఆదివారం నల్గొండలోని ఎన్జీ కళాశాల మైదానంలో 2కే, 5కే, 10కే రన్‌లు నిర్వహించారు. కలెక్టర్ బి. చంద్రశేఖర్, జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవర్ లతో కలిసి ఈ రన్‌లను ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, "శారీరక, మానసిక దృఢత్వం కోసం, మాదకద్రవ్యాలకు దూరంగా ఉండేందుకు ఇలాంటి రన్‌లు ఎంతో ఉపయోగపడతాయి. త్వరలో యోగా దినోత్సవం జరగనుంది. ప్రతి ఒక్కరూ యోగాను దైనందిన జీవితంలో అలవాటు చేసుకోవాలి. ఆరోగ్యానికి మించిన గొప్ప సంపద మరొకటి లేదు" అని అన్నారు. ఎస్పీ శరత్ చంద్ర పవర్ మాట్లాడుతూ, "నల్గొండ జిల్లాలో ఆరోగ్యంపై ఇలాంటి రన్‌లు నిర్వహించడం సంతోషకరం. శారీరక, మానసిక దృఢత్వం కోసం ప్రతి ఒక్కరూ ఇలాంటి కార్యక్రమాలను అలవాటు చేసుకోవాలి. రాష్ట్ర, జాతీయ స్థాయిలో కూడా నల్గొండకు మంచి పేరు తీసుకురావాలి" అని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ ఫర్ తెలంగాణ మగ్గారి శ్రీనివాసరావు, వాకర్స్ అసోసియేషన్ బండారు ప్రకాష్, డాక్టర్ పుల్లారావు, డాక్టర్ రమేష్, అనితా రాణి, డీఎస్పీ శివరామిరెడ్డితో పాటు అధికారులు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. సుమారు వెయ్యి మంది ఈ రన్‌లో పాల్గొని ఉత్సాహాన్ని ప్రదర్శించారు.

# అకాల వర్షాల వల్ల రైతులకు నష్టం

**- ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలి**




**నల్లగొండ, మే 3 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** బలమైన ఈదురుగాలులు, అకాల వర్షాల కారణంగా రైతులు తీవ్ర నష్టాన్ని ఎదుర్కొంటున్నారని సీపీఎం నల్లగొండ మండల కార్యదర్శి నలపరాజు సైదులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈదురుగాలుల వల్ల నిమ్మ, మామిడి, మునగ పంటలు నేలరాలాయని, వడ్ల కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడిసిపోయిందని ఆయన పేర్కొన్నారు. తడిసిన వరి ధాన్యాన్ని ఎలాంటి కొర్రీలు పెట్టకుండా వెంటనే కొనుగోలు చేయాలని, వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని కాంటాలు వేసి ధాన్యం ఎగుమతిని వేగవంతం చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ అధికారుల నిర్లక్ష్యం వల్ల రైస్ మిల్లర్ల దోపిడీ పెరుగుతోందని ఆయన విమర్శించారు. "ప్రతి గ్రామంలో తడిసిన వరి ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయడానికి మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ప్రత్యేక చొరవ చూపాలి" అని సైదులు కోరారు. "అకాల వర్షాల వల్ల తడిసిన ప్రతి గింజను ప్రభుత్వం కొనుగోలు చేయాలి. ఈదురుగాలుల వలన నేలరాలిన మామిడి రైతులను కూడా ప్రభుత్వం ఆదుకోవాలి" అని ఆయన స్పష్టం చేశారు.

# అచ్చంపేట ఎమ్మెల్యే కుమారుడి వివాహ వేడుకలో దేవరకొండ ఎమ్మెల్యే



**దేవరకొండ, మే 3 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** : హైదరాబాద్ మన్నెగూడలోని బీఎమ్ఆర్ సర్తా ఫంక్షన్ హాల్లో జరిగిన అచ్చంపేట ఎమ్మెల్యే చిక్కుడు వంశీకృష్ణ కుమారుడి వివాహ మహోత్సవానికి దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతన వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యే సతీమణి జ్యోతి ప్రసన్న, కుమారుడు నేనావత్ దేవరన్ నాయక్ కూడా ఈ వేడుకలో పాల్గొన్నారు.

# ( వలపు వల)

ఆడదాని ఓర చూపుతో
జగాన ఓడిపోని ధీరుడెవ్వడు
ఇది ఒక పాత సినిమా పాట
కానీ.. ప్రస్తుతం
కొందరు యువతులు ఎంచుకున్న
మోసపు బాట
డబ్బుల కోసం చేసే వేట
పాపపు పనుల పూదోట
-క్లబ్బుల్లో,పబ్బుల్లో మునిగి
డబ్బు యావలో పడి
గబ్బు పనులు చేస్తూ
కుట్రలు కుయుక్తులతో
వలపు వల విసిరి
పతిని వీడి
పలుచనైన పరపతి కోసం
పర పతులపై
మతి తప్పిన పన్నాగం వేసి
గతి తప్పి
అధోగతి పాలవుతుంది
-విలాసాలకు పావైపోయి
అందచందాలను ఆరబోసి
కామ వాంఛను ఎరగావేసి
నీవు ఇంద్రుడివి
నేను అప్సరసను
నీవు చంద్రుడివి
నేను కలువను అని
తనలో కలుపుకుంటుంది
-మత్తు మాటలతో
గమ్మత్తు చేష్టలతో
ఎత్తుకు పై ఎత్తు వేసి
మగాడి మనసు చిత్తు చేస్తుంది
-ప్రేమిస్తున్నానని
పెళ్లి చేసుకుంటానని
నమ్మబలికి
లక్షలు,కోట్ల
సంపాదనే ధ్యేయంగా
సహచరి
సంచారి అవుతుంది
-మనీ కోసం చింతెందుకు
అని చింతామణిగా మారి
అతిప్రియమైన ధనాన్ని
అవసరమైన ప్రియుడ్ని
దగ్గరికి చేర్చుకుంటుంది
-సంపత్తి కోసం
తేనెల మాటలతో
తేనె పూసిన కత్తయి
ఆపత్తి తలపెట్టి
విపత్తులో ఇరుక్కుపోతుంది
-ఆమని లాంటి భామిని
అక్రమ మనీ కోసం కామినియై
వగలాడి మాటలతో
మాయలేడి నటనలతో
డబ్బు మత్తులో తూగుతూ
ఊహల ఊయలలో ఊగుతూ
ఊబిలో దింపుతుంది
-సోషల్ మీడియా సాక్షిగా
మనస్సాక్షికి
మరణ శాసనం రాస్తుంది
మహిళల విలువలను
మట్టిలో కలిపేస్తుంది

Ch. శ్రీనివాస్
ఉపాధ్యాయుడు
ZPHS కనుకుల
స్వగ్రామం.. ఎలిగేడు

( ఈ మధ్యకాలంలో స్త్రీ జాతి గౌరవానికి భంగం కలిగించే విధంగా వ్యవహరిస్తున్న కొందరు యువతుల మరియు స్త్రీల వ్యవహార శైలిని వ్యతిరేకిస్తూ రాసిన కవిత)



# ఎండలు.. జనం బెంబేలు





- భానుడి ఉగ్రరూపం
- ఇళ్ల నుంచి బయటకి రావాలంటేనే జంకుతున్న ప్రజలు
- కనీస జాగ్రత్తలు తప్పనిసరి అంటున్న డాక్టర్లు

**ఆమనగల్లు, మే 03 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** భానుడు రోజురోజుకు ఉగ్రరూపం దాల్చుతుండడంతో జనం బయటికిరావాలంటేనే జంకుతున్నారు. జిల్లా వ్యాప్తంగా పది రోజులుగా గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదవుతుండడంతో ప్రజలు ఉక్కపోతతో సతమతమవుతున్నారు. మండలంలోని ప్రధాన రహదారి అయిన హైదరాబాద్- శ్రీశైలం రోడ్డు ఎప్పుడు రద్దీగా ఉండేది. భానుడు అగ్నిగుండంలా తలపిస్తుండడంతో ఉదయం 11 దాటితే చాలు రోడ్లపై ఒక్కరు కనిపించడంలేదు. ముఖ్యంగా చిన్నారులు, వృద్ధులు ఎండవేడిని తట్టుకోలేకపోతున్నారు. ఉపాధి కూలీలు, ఉద్యోగులు వ్యాపారులతో పాటు పనులకు వెళ్లే వారు సైతం ఉదయం 11 గంటల్లోపే ఆయా పనులను ముగించుకొని ఇళ్లకు చేరుతున్నారు.

**వడదెబ్బ తగలకుండా...**

ఉష్ణోగ్రతలు పెరిగిపోతుండడంతో కనీస జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. ద్రవ పదార్థాలు తగిన మోతాదులో తీసుకోకుంటే అనారోగ్యానికి గురికావడంతో పాటు ప్రాణానికే ప్రమాదం. వడదెబ్బకు గురైతే పల్స్ రేట్ పెరిగి, శ్వాస పీల్చడం కష్టమవుతుందని ఎండ నుంచి రక్షణ పొందటానికి నీడపట్టున ఉండాలి. వేసవిలో శరీరంలో నుంచి చెమట రూపంలో లవణాలు కోల్పోయి మనిషి నీరసపడిపోతాడు. డీహైడ్రేషన్ కు గురైన తర్వాత లూస్ మోషన్స్, వాంతులతో తీవ్రమైన జ్వరం వస్తుంది. చర్మ సంబంధ సమస్యలు తలెత్తుతాయి. డీహైడ్రేషన్ కు గురైన వారు వాంతులు, విరేచనాల బారిన పడి ఒక్కోసారి పరిస్థితి విషమించి ప్రాణాలు కోల్పోయే ప్రమాదముంటుంది. వడదెబ్బ నుంచి బయటపడాలంటే అధిక మోతాదులో తాగునీరు, కొబ్బరి నీరు, నిమ్మరసం, మజ్జిగ వంటి పానీయాలు తాగడం ఉత్తమమని వైద్యులు పేర్కొంటున్నారు.

**తగిన జాగ్రత్తలు తీసుకోవాలి**

**ఎండలు పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలు తగిన జాగ్రతలు తీసుకోవాలి. ముఖ్యంగా వృద్ధులు, పిల్లలు ఇళ్లలోనే ఉండడం ఉత్తమం ఒకవేళ బయటికి వెళ్లాలంటే ముందు సన్ స్క్రీన్ లోషన్ రాసుకొని పూర్తిగా కప్ప బడేలా దుస్తులు వేసుకొని వెళ్లాలి. అలాగే తలపై టోపీ గాని లేదా గొడుగు తీసుకెళ్తే ఎండ నుంచి రక్షణ పొందొచ్చు. ముఖ్యంగా రోజు కనీసం ఐదు లీటర్లకు పైగా నీరు, పండ్ల రసాలు వంటివి తాగుతూ ఉండాలి.**

- మైమున బేగం, వైద్యాధికారిణి, ఆమనగల్లు

**సన్ గ్లాసెస్ తో రక్షణ..**

ఎండలో వెళ్లేటప్పుడు కళ్లకు రక్షణగా సన్ గ్లాసెస్ వాడితే మంచిది. సూర్య కిరణాలు కళ్లలో పడితే కాటారాక్టు, గ్లూకోమా లాంటి కంటి జబ్బులు వచ్చే ప్రమాదముంది. కళ్ల అద్దాలు పెట్టుకొని బయటికి వెళ్లడం వల్ల యూవీ కిరణాలు కళ్లపై పడకుండా ఉండటంతో పాటు కళ్ల చుట్టూ ఉన్న సున్నితమైన కణాలు దెబ్బతినకుండా ఉంటాయి. ద్విచక్రవాహనాలపై వెళ్లేటప్పుడు దుమ్ము ధూళి పడకుండా ఉంటుంది. సన్ గ్లాసెస్ ను ఎంపిక చేసుకునేటపుడు బ్లాక్ కలర్ తో పాటు పెద్ద సైజువి ఎంపిక చేసుకోవడం మేలు.

## ప్రజల దాహార్తిని తీర్చటంలో అంబలి

# కేంద్రాలు ముఖ్య పాత్ర పోషిస్తాయి

- చెన్న కిషన్ రెడ్డి



**ఆమనగల్లు, మే 03 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** ప్రజల దాహార్తిని తీర్చడంతో పాటు ఆరోగ్యాన్ని కాపాడటంలో అంబలి కేంద్రాలు ముఖ్య పాత్ర పోషిస్తాయని లయన్స్ క్లబ్ మాజీ గవర్నర్, క్యాంపు కోఆర్డినేటర్ చెన్న కిషన్ రెడ్డి అన్నారు. లయన్స్ క్లబ్ ఆఫ్ ఆమనగల్లు ఆధ్వర్యంలో కడ్తాల్ లయన్స్ క్లబ్ సభ్యుల సహకారంతో గత నెల రోజులుగా కడ్తాల్ బస్టాండ్ ఆవరణలో కొనసాగుతున్న రాగి జావా, అంబలి కేంద్రానికి అపూర్వ ఆదరణ లభిస్తుందని ఆయన తెలిపారు. ఆదివారం ఒక ప్రకటనలో ఆయన మాట్లాడుతూ.. వేసవికాలంలో ఎండలు మండుతున్న వేల రాగిజావ ప్రయాణికులకు, బాటసారాలకు మరియు బస్టాండ్ ఆవరణలో ఉన్నవారికి ఆరోగ్యానికి ఎంతో ఉపశమనం ఇస్తుందని ఆయన అన్నారు. రాగి జావా అంబలి తీసుకోవడం ద్వారా శరీరానికి విటమిన్ 'సి ' లభిస్తుందని చెన్న కిషన్ రెడ్డి అన్నారు. ఈ రాగి జావా అంబలి కేంద్రం వేసవికాలం పూర్తయ్యే వరకు కొనసాగుతుందని అంబలి కేంద్రానికి సహకరిస్తున్న క్లబ్ సభ్యులకు ఆయన అభినందనలు తెలిపారు. లయన్స్ క్లబ్ ఆఫ్ ఆమనగల్లు నిరంతరం పేద ప్రజలకు అండగా ఉంటుందని మరియు వారికి సేవలు అందించడం లయన్స్ క్లబ్ లక్ష్యమని క్యాంపు ఆయన పేర్కొన్నారు. ప్రతిరోజు 400 మందికి ఈ రాగి జావా అంబలిని అందిస్తున్నట్లు తెలిపారు.

## భారత్ అతి పెద్ద ప్రయివేటు

# ఉపగ్రహం 'మిషన్ దృష్టి' విజయవంతం

-మేఘాలున్నా పొరుగుదేశాలపై నిఘా
-ప్రధాని మోడీ అభినందనలు



**బెంగళూరు మే 03 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** భారత అంతరిక్ష రంగంలో ప్రయివేటు రంగం జోరు పెంచింది. బెంగళూరుకు చెందిన 'గెలాక్స్ఐ' సంస్థ రూపొందించిన అతిపెద్ద ప్రయివేటు ఉపగ్రహం 'మిషన్ దృష్టి'ని ఆదివారం విజయవంతంగా ప్రయోగించారు. అమెరికాలోని కాలిఫోర్నియా నుంచి 'స్పేస్ ఎక్స్'కు చెందిన ఫాల్కన్-9 రాకెట్ ద్వారా ఈ ఉపగ్రహాన్ని కక్ష్యలోకి ప్రవేశపెట్టినట్లు గెలాక్స్ ఐ వ్యవస్థాపకులు సుయాశ్ సింగ్ సామాజిక మాధ్యమాల్లో పేర్కొన్నారు. భారత్‌లో ప్రయివేటు సంస్థలు రూపొందించిన ఉపగ్రహాల్లో ఇదే అతి పెద్దది. 190 కిలోల బరువున్న 'మిషన్ దృష్టి'లో ఆప్టోసార్ అనే ప్రత్యేక హైబ్రిట్ వ్యవస్థ ఉందని సింగ్ పేర్కొన్నారు. ఎలక్ట్రో-ఆప్టికల్ (ఇఒ), సింథటిక్ ఎపర్చర్ రాడార్ (ఎస్?ఎఆర్) సెన్సర్ల సాంకేతిక ద్వారా పనిచేస్తుందన్నారు. ప్రపంచ అంతరిక్ష చరిత్రలో ఈ తరహా టెక్నాలజీతో పనిచేసే మొట్టమొదటి ఉపగ్రహం ఇదే అని తెలిపారు. సాధారణ ఉపగ్రహాలు కేవలం వెలుతురు ఉన్నప్పుడు మాత్రమే స్పష్టమైన చిత్రాలను తీయగలవు, కానీ 'మిషన్ దృష్టి' మాత్రం పగలు, రాత్రి అనే తేడా లేకుండా వాతావరణం ఎలా ఉన్నా అత్యంత స్పష్టమైన చిత్రాలను పంపే సామర్థ్యం కలిగి ఉందని పేర్కొన్నారు. ఇందులోని 'సింథటిక్ అపర్చర్ రాడార్' దట్టమైన మబ్బులను సైతం చీల్చుకుని, ఎలాంటి లైటింగ్ లేని కటిక చీకటిలోనూ భూమిపై ఉన్న వస్తువులను స్పష్టంగా ఫోటోలు తీయగలదని తెలిపారు. శత్రువుల బంకర్లు, వాహనాల కదలికలు, సరిహద్దుల్లో చొరబాట్లను ఎప్పటికప్పుడు అత్యంత కచ్చితత్వంతో దృష్టి శాటిలైట్ పసిగట్టగలదని పేర్కొన్నారు. ఏకకాలంలో ఆప్టికల్, రాడార్? డేటాను సేకరించి, అవుట్?పుట్?లను ఒకే చిత్రంగా మిళితం చేస్తుందన్నారు. దీనివల్ల సాధారణ ఉపగ్రహాల కంటే 3 రెట్లు ఎక్కువ ఉపయోగకర సమాచారం లభిస్తుందన్నారు. మిషన్? దృష్టి ద్వారా ప్రకృతి విపత్తుల సమయంలో సహాయం, వ్యవసాయ పర్యవేక్షణ, సరిహద్దు భద్రత, మౌలిక వసతుల ప్రణాళిక లాంటివి మరింత సమర్థవంతంగా నిర్వహించవచ్చు అని పేర్కొన్నారు. భారత అంతరిక్ష సంస్థ ఇస్రో ప్రస్తుతం నిర్వహిస్తున్న 29 భూమి పరిశీలన ఉపగ్రహాలకు ఇది అనుబంధంగా పనిచేస్తుందన్నారు. 'ఆపరేషన్ సిందూర్' వంటి సమయాల్లో బాంబు దాడుల నష్టాన్ని అంచనా వేయడానికి భారత్ విదేశీ శాటిలైట్లపై ఆధారపడాల్సి వచ్చిందని, ఇక ఆ పరిస్థితి ఉండదన్నారు. మిషన్ దృష్టిని గెలాక్స్ఐ సంస్థ ఐఐటి -- మద్రాస్‌లో రూపొందించింది.

**మరో 9 ఉపగ్రహాలకు ప్లాన్**

రాబోయే రోజుల్లో ఇలాంటివి మరో 9 ఉపగ్రహాలను ప్రయోగించి ఒక 'కాన్‌స్టెలేషన్' ఏర్పాటు చేయనున్నామని సుయాశ్ సింగ్ తెలిపారు. ప్రస్తుతం దృష్టి శాటిలైట్ 1.5 మీటర్ల అత్యుత్తమ రిజల్యూషన్‌తో చిత్రాలను అందిస్తుందన్నారు. రాబోయే ఉపగ్రహాలు 0.5 నుంచి 0.3 మీటర్ల రిజల్యూషన్‌తో ఉంటాయన్నారు.